ప్రజాశక్తి

సోమవారం 6 అక్టోబర్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

పత్తికి చీడపీడలు

- వెంటాడుతున్న గులాబి పురుగు
- అధిక వర్షాలతో పెరిగిన తెగుళ్లు
- పంట రక్షణ కోసం అధికంగా మందులు వినియోగం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పత్తిపై చీడపీడల ప్రభావం పెరుగుతోంది. ఒక వైపు అధిక వర్షాలు, మరోవైపు తెగుళ్ల ప్రభావంతో రైతులు అల్లాడుతున్నారు. పల్నాడు జిల్లాలో 2.08 లక్షల ఎకరాలు, గుంటూరు జిల్లాలో 55 వేల ఎకరాల్లో ఈ ఏడాది పత్తి సాగు చేశారు. పలు మండలాల్లో అధిక వర్షాల వల్ల పొలం నీరు నిలిచి ఉరకెత్తి ఎర్ర తెగులు ఏర్పడింది. ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, మేడికొండూరు, తాడికొండ, పెదకాకాని తదితర మండలాల్లో పత్తి సాగులో ఈ ఏడాది కీటకాల ప్రభావం అధికంగా కన్పిస్తోంది. ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది పత్తి పంట చేతికి వచ్చే సమయానికి గులాబి రంగు పురుగు పైరును కబళిస్తోంది. దీంతో రైతుల్లో ఆందోళన పెరిగి పురుగు మందులనూ అధికంగా వాడుతున్నారు. వర్షం కురిసినప్పుడు తప్ప మిగతా రోజుల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటున్నా తెగుళ్ల బెడద తగ్గడం లేదు.





మేడికొండూరు వద్ద ఎరుపురంగులోకి మారిన ఆకులు... కాయలోకి చొరబడి పత్తిని తినేస్తున్న గులాబి పురుగు

గులాబీ రంగు బోల్ వార్మ్‌గా ప్రసిద్ధి చెందిన ఈ కీటకం పత్తి సాగులో ఒక తెగులుగా ప్రసిద్ధి చెందింది. గులాబీ పురుగుల నిరోధానికి గత కొంత కాలంగా పొలంలో బుట్టలు ఏర్పాటు చేస్తున్నారు. అయినా ఆశించిన స్థాయిలో నివారించలేకపోతున్నారు. గులాబి పురుగులో కాయలోకి చేరి పత్తి ఉత్పత్తులను బాగా దెబ్బతీస్తోంది. అవి విత్తనాలను తినడానికి పత్తి లింట్‌ను నమలుతాయి. పత్తిని ఫైబర్ మరియు విత్తన నూనె రెండింటికీ ఉపయోగిస్తారు కాబట్టి నష్టం రెండు రెట్లు ఉంటుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ప్రపంచంలోని పత్తి పండించే చాలా ప్రాంతాల్లో ఇది ఒక దురాక్రమణ జాతిగా మారింది. ఇది 1920 నాటికి దక్షిణ యునైటెడ్ స్టేట్స్‌లోని పత్తి బెల్ట్‌కు చేరుకుంది. దక్షిణ కాలిఫోర్నియా ఎడారుల్లోని పత్తి పొలాలలో ఇది ఒక ప్రధాన తెగులు. ట్రాన్స్‌జెనిక్ బిటి పత్తిని ఉపయోగించడం స్టెరైల్ మగ పురుగులను విడుదల చేయడం అనే సినర్జిస్టిక్ కలయిక ద్వారా ఖండాంతర యునైటెడ్ స్టేట్స్ నుండి దీనిని నిర్మూలించినట్టు అమెరికా 2018లో ప్రకటించినా

▶ 2లో

అక్రమ బదిలీలు షురూ!

నిబంధనలకు విరుద్ధంగా ఉపాధ్యాయ బదిలీలు

ప్రజాశక్తి-గుంటూరు

కూటమి ప్రభుత్వంలోనూ అక్రమ బదిలీలకు తెరలేపింది. గత ప్రభుత్వం మాదిరిగానే ఈ ప్రభుత్వంలోనూ సిఫార్సు బదిలీలు చేపట్టడంపై ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఆరుగురు ఉపాధ్యాయులకు ప్రభుత్వ పెద్దల సిఫార్సులతో బదిలీలు జరిగినట్లు తెలిసింది. ఆ విధంగా బదిలీ అయిన వారిలో కృష్ణా జిల్లాకు చెందిన ఒకరు మంగళగిరి నియోజకవర్గంలోని నిడమర్రు జెడ్పీ హైస్కూల్లో నియమితులై ఆదివారం విధులు చేపట్టారు. అంతర్ జిల్లాల బదిలీలు కూడా ముగిసిన తర్వాత ఇప్పుడు బదిలీ ఉత్తర్వులు రావటం గమనార్హం. అంతర్ జిల్లాల బదిలీల్లోనూ స్పౌస్, మ్యూచ్‌వల్ కారణాలతో బదిలీలు కోరుకున్నా కొందరికి అవకాశం దక్కలేదు. 3, 4 కేటగిరీలకు మాత్రమే అంతర్ జిల్లాల బదిలీలు జరిగాయి. ఇప్పుడు ఏకంగా మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కేటగిరీ-1లో బదిలీలు జరగటంపై ఉపాధ్యాయుల నుండి వ్యతిరేకత వస్తోంది. ప్రభుత్వ పెద్దల అండదండలున్న వారు వారికి నచ్చినచోట బదిలీలు తెచ్చుకుంటే సాధారణ ఉపాధ్యాయులు ఇటువంటి సిఫార్సు బదిలీల పట్ల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యా సంవత్సరం మధ్యలో బదిలీలు ఉండబోమని చెప్పిన ప్రభుత్వం అక్రమ బదిలీలు చేపట్టటాన్ని ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. అంతేకాకుండా వేరే జిల్లా నుండి బదిలీ చేయటం నిబంధనలకు విరుద్ధమే కాకుండా ఇక్కడి ఉపాధ్యాయుల్ని అవమానించటమేనని సంఘాలు భావిస్తున్నాయి. తక్షణమే అక్రమ బదిలీని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

సాగర్ గేట్ల మూసివేత

ప్రజాశక్తి - విజయపురిసౌత్



ఆదివారం ఉదయం 26 గేట్ల ద్వారా కొనసాగిన నీటి విడుదల ఒక్కసారిగా ఎగువ కృష్ణానది పరివాహక ప్రాంతాల నుండి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో సాయంత్రానికి నాగార్జున సాగర్ డ్యామ్ గేట్లను మూసివేశారు. శ్రీశైలం జలాశయం నుండి 63,398 క్యూసెక్కుల వరద నీరు సాగర్ జలాశయానికి విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 587.50 అడుగులవద్ద నీరు నిల్వవుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 305.8030 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 33,901 క్యూసెక్కులను, కుడి కాల్వ ద్వారా 10,040 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 8896 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బిసి ద్వారా 2400 క్యూసెక్కులు, లోలెవల్ కెనాల్ ద్వారా 300, మొత్తంగా 55,537 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

రేపు ఫ్యాప్టో చలో విజయవాడ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం, డిమాండ్ల సాధన కోసం ఫ్యాప్టో ఆధ్వర్యంలో మంగళవారం తలపెట్టిన 'చలో విజయవాడ'ను జయప్రదం చేయాలి పల్నాడు జిల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎం.మోహనరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు కరపత్రాలను నరసరావుపేటలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల నియంతలా వ్యవహరిస్తూ అనేక హక్కులను కాలరాసిందని, సమస్యల పరిష్కారానికి అప్పట్లో హామీనిచ్చిన కూటమి ఇప్పుడు చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. 4 డిఎ బకాయిలను విడుదల చేయాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి తప్పించి, బోధనకే పరిమితం చేయాలని కోరారు. యాప్‌ల భారం నుండి విముక్తి కల్పించాలని, సరెండర్ లీవ్, పిఎఫ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు బి.ప్రజామూర్తి, టి.వెంకటేశ్వర్లు, డిఎన్ఎస్ మూర్తి, కె.రవి, సిహెచ్.నాగేశ్వరరావు, ఎం.రామాంజనేయులు, టి.నాగరాజు పాల్గొన్నారు.



శిలాఫలకం వద్ద నిరసనలో నేతాజి తదితరులు

నేటికీ నెరవేరని లోకేష్ హామీ

- పేదలకు ఇళ్ల స్థలాలు, పట్టాల కోసం మూడ్రోజుల దీక్షలు
- 17న ఎమ్‌టిఎంసి కార్యాలయం ఎదుట ధర్నా
- పాదయాత్రలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి నేతాజి
- లోకేష్ వేసిన శిలాఫలకం వద్ద నిరసన

ప్రజాశక్తి- తాడేపల్లి

రైల్వే, కొండ పోరంబోకు, ఇరిగేషన్ తదితర ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు, ఇంటి స్థలం లేని వారికి రెండు సెంట్లు ఇళ్ల స్థలం, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం ఇవ్వాలని, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. ఉండవల్లి గుంటూరు ఛానల్ హెడ్ రెగ్యులేటర్ దగ్గర తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పుష్కర కాలనీ వద్ద, సీతానగరంలో మంత్రి నారా లోకేష్ వేసిన శిలాఫలకం వద్ద సిపిఎం కార్యకర్తలు ఆదివారం ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. ఇదేక్రమంలో తాడేపల్లి సెంటర్లో పోతురాజు స్వామి గుడి, రన్నింగ్ రూమ్ సెంటర్, వెంకయ్య కొట్టు సెంటర్ తదితర ప్రాంతాల్లో సిపిఎం కార్యకర్తలు

▶ 2లో

పేదలు, రైతుల గుండెల్లో

సీడ్ యాక్సెస్ గుబులు



ప్రజాశక్తి- తాడేపల్లి : సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభిస్తామనే సిఆర్‌డిఎ అధికారుల ప్రకటనతో తాడేపల్లి ప్రాంతంలోని రైతుల గుండెలు గుబేలు మటున్నాయి. మణిపాల్ హాస్పిటల్ నుండి సుందరయ్య నగర్ కట్ట ఈవతల నుండి ఆసుపత్రి పక్కగా, రైతుల పంట పొలాల్లో నుండి సీతానగరంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రి సమీప నుండి బోటు యార్డులో గుండా, రైల్వే ట్రాక్ దాటి, సీతానగరం కొండ పక్కన ఉంటున్న పేదల ఇళ్ల మీదుగా సీడ్ యాక్సెస్ రోడ్డును గత టిడిపి ప్రభుత్వం రూపొందించింది. అయితే అనంతరం ఎన్నికల్లో టిడిపి ఓటమితో ఈ అంశం మరుగున పడింది. ప్రస్తుతం మళ్లీ తెరపైకి రావడంతో ఈ ప్రాంతంలో వారిలో ఆందోళన నెలకొంది. బకింగ్ హామ్ కాల్వ సమీప నుండి కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం సమీపంలోని పొలాల్లో ఫ్లైఓవర్ దిగుతుందని డిజైన్ రూపొందించారు. ఈ క్రమంలో న్యాయమైన పరిహారాన్ని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని సుమారు 160 కుటుంబాలూ బాధితులయ్యే అవకాశం ఉండడంతో వారూ తమ పరిస్థితి ఏమిటనే కంగారులో ఉన్నారు. తమ ఇళ్లనే తొలగించాల్సి వస్తే ప్రత్యామ్నాయంగా రెండు సెంట్ల స్థలాన్నీ ఇవ్వాలంటున్నారు.

తమ్మలపాలేనికి స్వచ్ఛ పంచాయతీ అవార్డు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు



స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్ అవార్డుకు ఎంపికైన ఉయ్యాల శివ పార్వతి

జిల్లా స్థాయిలో స్వచ్ఛ అవార్డుకు మండలంలోని తుమ్మలపాలెం పంచాయతీ ఎంపికవగా ఉత్తమ స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్‌గా ఇదే గ్రామానికి చెందిన ఉయ్యాల శివపార్వతి ఎంపికయ్యారు. స్వచ్ఛ హాస్పిటల్‌గా నియోజకవర్గంలోని మండల కేంద్రమైన వట్టిచెరుకూరు ఆస్పత్రి, ఉత్తమ స్వచ్ఛ విలేజ్ ఆర్గనైజేషన్‌గా లేమల్లెపాడు నిలిచాయి. వీరికి గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సోమవారం నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేయనున్నారు.

స్వచ్ఛ పంచాయతీగా దుగ్గిరాల

ప్రజాశక్తి - దుగ్గిరాల

దుగ్గిరాల గ్రామపంచాయతీ జిల్లా స్థాయిలో ఉత్తమ స్వచ్ఛ పంచాయతీగా ఎన్నికైన సందర్భంగా గ్రామ సర్పంచ్ బాణావత్ ఖుషి భాయ్, పారిశుద్ధ కార్మికులను సన్మానించనున్నట్లు కార్యదర్శి వివేకానంద తెలిపారు. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సోమవారం మధ్యాహ్నం వీరిని సన్మానిస్తారు. గ్రామంలో పారిశుధ్యం పాటించటంలో పంచాయతీ సాధించిన ఘనతకు గుర్తింపుగా వీరికి సన్మానం లభించినది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన అనేకమంది ప్రముఖులు వారికి అభినందనలు తెలిపారు.

నేడు స్వచ్ఛ అవార్డుల ప్రదానం

ప్రజాశక్తి - చేబ్రోలు

చేబ్రోలుకు స్వచ్ఛ పంచాయతీ, స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్ అవార్డులు కార్యదర్శి కె.శ్రీనివాసరావు, స్వచ్ఛ గ్రీన్ అంబాసిడర్‌గా నల్లపాటి రాఘవమ్మ సోమవారం గుంటూరులో జిల్లాస్థాయి స్వచ్ఛ అవార్డులు అందుకోనున్నారు. ఈ కార్యక్రమం గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరుగుతుందని పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు.

పత్తికి చీడపీడలు

(మొదటి పేజీ తరువాయి)

ఏమాత్రమూ నియంత్రించలేకపోయారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రతిఏటా రైతులకు కొన్ని సలహాలు, సూచనలు మినహా నివారణకు శాశ్వత పరిష్కారం చూపలేకపోయారు.



ప్రస్తుతం రెండు జిల్లాల పరిధిలో ఎక్కువ ప్రాంతాల్లో పత్తి కాయ, పువ్వు దశలో ఉంది. కాయల్లోకి కూడా గులాబి పురుగులు చొరబడుతున్నాయి. పువ్వులను, ఆకులను, కాండంతో సహా మొత్తం పత్తి చెట్టును తినేస్తుండటంతో రైతులు ఏమీ చేయలేక నిస్సహాయస్థితిలో ఉండిపోతున్నారు.పత్తిలో గులాబి పురుగు ఉధృతి నివారణకు ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలు అమర్చుకోవాలని అధికారులు సూచించారు. రోజుకు ఎనిమిది త తల్లి పురుగులు చొప్పున వరుసుగా నాలుగు రోజులు బుట్టలలో పడితే నివారణకు అవకాశం ఉందంటున్నారు. ప్రతి ఏటా ఈ సమస్య ఉత్పన్నం అవుతున్నా గత సీజన్‌లో మిర్చి ధరలు పడిపోవడంతో గత్యంతరం లేక అధిక శాతం మంది రైతులు పత్తి పంట వైపు మొగ్గుచూపారు. అయితే ఈఏడాది పత్తి పంటలో ప్రతికూల పరిస్థితులు ఏర్పడుతున్నాయని లాంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ నేపథ్యంలో చీడపీడల నివారణకు ఎకరానికి 30 కిలోల యూరియా, 10 కిలోల మ్యూరెట్ ఆఫ్ పొటాష్ వినియోగించాలని రైతులకు సూచిస్తూ ఎస్ఎంఎస్ సందేశాలు పంపిస్తున్నారు. అధిక వర్షాల వల్ల వేరుకుళ్లు సోకినట్టు గుర్తించారు. ఈ తెగులు నివారణకు 0.3 శాతం కాపర్ ఆక్సీక్లోరైడ్ ద్రావణం వాడాలని సూచించారు. పత్తిలో మేగ్నేషియం లోపం వల్ల ఆకులు ఎర్రగా మారిపోతున్నట్టు గుర్తించారు.

నేటికీ నెరవేరని లోకేష్ హామీ

(మొదటి పేజీ తరువాయి)



పాదయాత్ర చేసి పేదలతో మాట్లాడారు. ఈనెల 17వ తేదీ మంగళగిరిలోని ఎమ్‌టిఎంసి కార్యాలయం వద్దకు దరఖాస్తులతో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ 2016లో కృష్ణ పుష్కరాలు సందర్భంగా సీతానగరంలో 500 మంది పేదల ఇళ్లను అప్పటి టిడిపి ప్రభుత్వం తొలగించిందని, ఆనాడు ఇచ్చిన హామీ నేటికీ నిలబెట్టుకోలేదని అన్నారు. 160 మందికే 30 గజాలు చొప్పున తాత్కాలికంగా ప్రస్తుతం పుష్కర కాలనీలో స్థలాలు ఇచ్చారని, ఇప్పటిదాకా వారికి శాశ్వతమైన స్థలాలు ఇవ్వలేదని చెప్పారు. బాధితులకు ఇప్పటికైనా స్థలాలు ఇవ్వాలని, ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల సాయం అందించాలని డిమాండ్ చేశారు. యువగళం పాదయాత్ర సందర్భంగా సీతానగరంలో శిలాఫలకం వేసి, పట్టణ ప్రాంతంలో నివసిస్తున్న వారికి రెండు సెంట్లు ఇళ్ల స్థలం, గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్న వారికి మూడు సెంట్లు ఇంటి స్థలం ఇస్తానన్న నారా లోకేష్ వాగ్దానాన్ని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. మంత్రి లోకేష్ చెప్పిన విధంగా 20 వేల మంది లబ్ధిదారులకు సంబంధించి జాబితా ప్రకటించాలని కోరారు. ఇంటి స్థలాలు ఇస్తామన్న వాగ్దానాన్ని పక్కనపెట్టి టిడ్కో ఇళ్లు ఇస్తామనే ప్రచారం తగదని, ఆ ఇళ్ల నిర్మాణంపై ప్రభుత్వానికే ఇంకా స్పష్టత లేదని విమర్శించారు. ఈ అంశాలపై 13,14,15 తేదీల్లో మంగళగిరిలోని ఎమ్‌టిఎంసి కార్యాలయం ఎదుట దీక్షలు, 17న అర్హులతో ధర్నా చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, జి.సుబ్బారెడ్డి, కె.మేరీ, కె.బాబురావు, డి.విజయబాబు, జి.అంజిరెడ్డి, ఎస్‌కె సుభాని, ఎస్.కె నాగూర్ పాల్గొన్నారు.

ఈదారు గాలులతో వాన.. విరిగిపడిన చెట్లు..

పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ఈదురు గాలులతో కూడిన వర్షానికి ఆదివారం మండలంలో పలుచోట్ల చెట్లు విరిగి తీగలపై పడ్డాయి. యనమదలలో స్తంభం విరిగి వాలడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చిన్న కొండ్రుపాడు వద్ద చెట్లు విరిగి తీగలపై పడటంతో రావిపాటివారిపాలెం, చిన్నకొండ్రుపాడు, నడింపాలెం, ఈదులపాలెంలో విద్యుత్ సరఫరా నిలిచింది. సాయంత్రం 5 గంటల తర్వాత మొదలైన వానతో నిలిచిన విద్యుత్ రాత్రి 10 గంటల తర్వాత కూడా పునరుద్ధరణ కాలేదు. మరోవైపు అస్తవ్యస్థ డ్రెయినేజీ కారణంగా మురుగు రోడ్లపైకి వచ్చి దుర్గంధం, దోమల ఉధృతి, ఉక్కపోతకు జనం నానా అవస్థ పడుతున్నారు. చిన్నపిల్లల పరిస్థితి చెప్పనలవిగాకుండా ఉంది. విద్యుత్ ఎఇ సాంబశివరావు ఆధ్వర్యంలో సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.





యనమదలలో పడిపోయిన కరెంట్ స్తంభం.. చిన్న కొండ్రుపాడులో మరమ్మత్తులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది.

ప్రజా సమస్యలపై నేడు గ్రీవెన్స్‌కు సిపిఎం

ప్రజాశక్తి - కొల్లిపర



మాట్లాడుతున్న ఎం.శివసాంబిరెడ్డి

ఉద్యమించకుండా సమస్యలు పరిష్కారం కావని, పోరాటాలతోనే ప్రభుత్వాలు కళ్లు తెరుస్తాయని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.భావనారాయణ అన్నారు. మండలంలోని గుదిబండివారిపాలెం హౌసింగ్ కాలనీలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్లకు రాయితీలిస్తూ సామాన్య ప్రజలపై ప్రభుత్వాలు పన్నులు, ఛార్జీలు, ఇతర రూపాల్లో భారాలు వేస్తున్నాయని చెప్పారు. సబ్సిడీలు పేరుతో స్వల్పంగా తాయిలాలు ఇచ్చినట్లు కనిపించినా అవన్నీ ఓట్ల కోసమేనని, అంతకు మించి ప్రజల వద్ద లాక్కుంటున్నారని విమర్శించారు. ప్రైవేటు కంపెనీలు విద్యుత్ ఉత్పత్తి చేసుకుని లాభాలు దండుకుని మార్గాలు చూపుతూ వినియోగదారుల మీద ఛార్జీల భారం వేస్తున్నారని చెప్పారు. టిడిపి ప్రభుత్వ హయాంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను జగన్ మోహన్‌రెడ్డి విస్మరించారని, అదేకోవలో వైసిపి హయాంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఇళ్ల స్థలాలను, కాలనీలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం విస్మరిస్తోందని అన్నారు. వారి రాజకీయ కక్షలకు ప్రజలను బలిచేస్తున్నారని విమర్శించారు. ఫలితంగా ప్రజలే నష్టపోతున్నారని, ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా ఉద్యమించాలని సూచించారు. సిపిఎం సీనియర్ నాయకులు ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ గుదిబండివారిపాలెం హౌసింగ్ కాలనీ ఏర్పడి మూడేళ్లయినా ఇంతవరకు అంతర్గత రహదారులు, డ్రెయినేజి సౌకర్యం ఏర్పాటు చేయలేదన్నారు. ఈ కారణంగా స్థానిక పేద ప్రజలు వర్షాకాలంలో బురద, దోమలతో అవస్థలు పడుతున్నారని చెప్పారు. దీనిపై పలుమార్లు అర్జీలిచ్చినా స్పందించలేదన్నారు. ఈ సమస్యలపై తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం జరిగే గ్రీవెన్స్‌లో మరోసారి విన్నవిస్తామని, కార్యక్రమంలో పేదలంతా పాల్గొనాలని కోరారు.

ప్రశాంతంగా ఎపిపి పరీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులను భర్తీ కోసం స్థానిక పలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరులా కళాశాలలో ఆదివారం రాత పరీక్షలు జరిగాయి. పరీక్షా ఏర్పాట్లు, బందోబస్తును జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ పర్యవేక్షించారు. జిల్లా అదనపు ఎస్‌పి రమణమూర్తి, డిఎస్‌పి భానోదయ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రంలో అభ్యర్థుల సీటింగ్ ఏర్పాట్లను, పరీక్షల సరళిని పరిశీలించి, ఇన్విజిలేటర్లతో మాట్లాడి ఏదైనా సమస్య తలెత్తితే వెంటే నోడల్ ఆఫీసర్‌గా ఉన్న అదనపు ఎస్‌పి రమణమూర్తికి తెలియజేయాలని ఎస్‌పి సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ రాధిక, ఇతర యాజమాన్యంతో మాట్లాడి పరీక్షల నిర్వహణ విధానాన్ని తెలుసుకుని, ఆ ప్రక్రియ సక్రమంగా జరిగే విధంగా పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నల్లపాడు సిఐ వంశీధర్, ఎస్సై వాసు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



పరీక్ష కేంద్రంలో ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలన

ఆరుగురు గంజాయి విక్రేతలు అరెస్టు

రెండు కిలోల సరుకు స్వాధీనం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

గంజాయి విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తప్పవని సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకట్ హెచ్చరించారు. యువకులు, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కావద్దని, మాదకద్రవ్యాల మోజులో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. యువకులు, విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని గంజాయి విక్రయ కార్యకలాపాలు సాగిస్తున్న ముఠాను మంగళగిరి గ్రామీణ పోలీసులు అరెస్టు చేశారు.. ఈ సందర్భంగా ఆరుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో మాదకద్రవ్యాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు. ఆదివారం మంగళగిరి గ్రామీణ పోలీస్ సర్కిల్ అధికారి కార్యాలయంలో ఈ మేరకు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. మంగళగిరి గ్రామీణ సిఐ వై.శ్రీనివాసరావు ఎస్ఐ



వివరాలు వెల్లడిస్తున్న సిఐ, ఎస్ఐ, చిత్రంలో నిందితులు

చిరుమామిళ్ల వెంకట్ మీడియాతో మాట్లాడుతూ బేతపూడి గ్రామానికి చెందిన బేతపూడి చందు, పెద్దవడ్లపూడికి చెందిన జొన్నలగడ్డ ఆనంద్, మంగళగిరి బాప్టిస్ట్‌పేటకు చెందిన బుల్లారవి, ఆత్మకూరు గ్రామానికి చెందిన కొండిటి తేజ, మంగళగిరి టిప్పర్లబజార్‌కు చెందిన కంచర్ల చైతన్య, నిడమర్రు గ్రామానికి చెందిన దూరు లక్ష్మణరావు, మరో ఇద్దరు నవులూరు గ్రామానికి చెందిన సత్విక్, నిడమర్రుకు చెందిన నగేష్ పరారీలో ఉన్నారని తెలిపారు. నిందితులందరూ 25 సంవత్సరాలలోపు యువకుల కావడం గమనార్హం. ప్రధాన నిందితులు విశాఖపట్నం జిల్లా పాడేరు కొండ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తుల వద్ద నుండి కిలో రూ. 5వేల చొప్పున గంజాయిని కొనుగోలు చేసి, చిన్న చిన్న పొట్లాలు గా మార్చి ఒక్కొక్క పొట్లాన్ని రూ.500లకు అమ్మేవారని తెలిపారు. యువకులు, విద్యార్థులు వారికి ప్రధాన కొనుగోలు దారులని, వీరిని ఆకర్షించడానికి సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయాలు పెంచుకున్నారని విచారణలో బయటపడినట్లు వారు తెలిపారు. ఇటీవల పాడేరు ప్రాంతం నుండి తెచ్చుకున్న రెండుకిలోల గంజాయిని మంగళగిరి అంతర్జాతీయ క్రీడా మైదానం సమీపంలో పంపిణీ చేయడానికి సిద్ధమవుతుండగా పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. మధ్యవర్తుల సమక్షంలో గంజాయిని స్వాధీనం చేసు కుని, నిందితులను న్యాయస్థానం ముందు హాజరు పరచను న్నట్లు గ్రామీణ సిఐ, ఎస్ఐ తెలిపారు. పరారీలో ఉన్న ఇద్దరిని త్వరలో పట్టుకుంటామని చెప్పారు. ఈ కేసు దర్యాప్తులో సీఐ, ఎస్ఐలతోపాటు సిబ్బంది ఏఎస్ఐ రమేష్, హెడ్ కాని స్టేబుల్ అంకమ్మరావు, కానిస్టేబుళ్ల రాము, సాగర్‌బాబు, పాల్గొని మెరుగైన పనితీరును ప్రదర్శించినట్లు అధికారులు తెలిపారు.



నాదెండ్లకు వినతిపత్రం అందజేస్తున్న ప్రభాకర్‌రావు

సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలని కోరుతూ అంబేద్కర్ ఛారిటబుల్ ట్రస్ట్ (యాక్ట్) అధ్యక్షులు ఆళ్ళమూడి ప్రభాకరరావు రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌కు ఆదివారం వినతి పత్రం సమర్పించారు. స్థానిక బోస్ రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో యాక్ట్ తరపున మంత్రిని కలిసి, తెనాలిలో స్కూల్ ఏర్పాటు అవసరం, ఆవశ్యకతను వివరించి, వినతి పత్రం సమర్పించినట్లు ప్రభాకరరావు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మేకల చిట్టిబాబు, పలువురు యాక్ట్ సభ్యులు పాల్గొన్నారు.

బాల కోటేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌కు శుభాకాంక్షలు



అనంత లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న గౌడ సంఘం నాయకులు

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన గౌడసంఘం ఆధ్వర్యంలో వడ్లమూడి క్వారీ శ్రీ బాల కోటేశ్వర స్వామి ఆలయానికి చైర్మన్ బాధ్యతలను చేపట్టిన అనంత లక్ష్మీనారాయణను సత్కరించారు. స్థానిక పట్టణ గౌడ సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమం లో పలువురు వక్తలు మాట్లాడుతూ అంచెలంచెలుగా ఎదిగిన లక్ష్మీనారాయణ ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌గా నియామకం కావ డం అభినందనీయమన్నారు. ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గీతబంధు సేవా సమితి ట్రస్ట్ చైర్మన్ వి.రంగారావు, రాష్ట్ర గౌడసంఘ వైస్ ప్రెసిడెంట్ సిహెచ్ శ్రీనివాసరావు, జిల్లా గౌడసంఘ అధ్యక్షుడు తుళ్లూరు శ్రీనివాసరావు, బెల్లంకొండసురేష్, కె.బాలాజీ, వాక సాంబ శివరావు, గిరిగణేష్, కె.బాబురావు, సి.సురేష్ పాల్గొన్నారు.



ప్రమాదకరంగా రోడ్డు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని లంకెలకూరపాడు నుండి నార్నెపాడు వెళ్ళే రోడ్డు మార్గంలో రోడ్డు నెర్రలిచ్చి ప్రమాదకరంగా తయారైంది. ఈ రోడ్డు మార్గంలో రోడ్డుకు అనుకుని పంట కాలువ ప్రక్కనే ఉండడం మూలమలుపు వద్ద నెర్రలిచ్చి భారీ గొయ్యి ఏర్పడే అవకాశం ఉంది. ఈ మార్గంలో నార్నెపాడు, లంకెలకూం`పాడు గ్రామాలకు ప్రజలు, రైతులు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు మార్గంలో నెర్ర లిచ్చిన ప్రాంతాన్ని తొలగించి రోడ్లు వేయాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

8న సెపక్ తక్రా జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

పల్నాడు జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ ఆధ్వర్యం లో జూనియర్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపికలు సత్తెన పల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఈనెల 8 తేదీన నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్య దర్శులు డాక్టర్ వడ్డెంపూడి పవన్‌కుమార్ పి.శివరామకృష్ణ తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు 2007, జనవరి ఒకటి తర్వాత జన్మించిన వారై ఉండాలని చెప్పారు. ఎంపి కయిన క్రీడాకారులు ఈనెల 11, 12 తేదీలో ప్రకాశం జిల్లా, చీరాలలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ ఛాంపి యన్ షిప్ పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 8712129398, 9985186556 నంబరు ను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

గో సంరక్షణ పేరుతో అక్రమాలు?

ఆహారం లేక మృత్యువాత పడుతున్నాయని గ్రామస్తుల ఆందోళన



గోశాల వద్ద గ్రామస్తులు, నిర్వాహకుల వాగ్వివాదం



చిక్కి శల్యమైన మూగజీవాలు,



మృతి చెందిన ఆవు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం అనంతవరంలో గోశాల నిర్వహణపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శ్రీ వెంకటేశ్వర స్వామి గుడికి సమీపంలో సిఆర్‌డిఎ స్థలంలో ఏర్పాటు చేసిన గోశాలలో ఆవులు, ఎద్దులు ఆహారం, నీరు లేక చనిపోతున్నాయని గ్రామస్తులు ఆదివారం ఆందోళనకు దిగారు. అమ్ముకున్న, అద్దెకు ఇచ్చిన ఆవుల లెక్కలు చెప్పాలని గోశాల నిర్వాహకులను నిలదీశారు. దీంతో గ్రామస్తులకు, నిర్వాహకుల మధ్య వాగ్వివాదం, తోపులాట జరిగింది. గోశాల నిర్వహణ సరిగానే ఉందని, కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని గ్రామస్తులపై నిర్వాహకులు మాటల దాడికి దిగడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. గోశాల నిర్వహణలో లోపాలను ఎత్తిచూపితే సమాధానం చెప్పకుండా బెదిరింపులకు దిగడంపై గ్రామస్తులు మండిపడ్డారు. స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి అండదండలతో కొంత మంది ఆవులు, ఎద్దులను తెచ్చి గోసంరక్షణ కేంద్రం ఏర్పాటు చేశారని గ్రామస్తులు చెబుతున్నారు. దీని ఏర్పా టుకు అనువైన స్థలం లభ్యత, పశువులకు అవసరమైన ఆహారం, తాగునీరు, పరిశుభ్రత, వైద్యం వంటివి ఉండాలి. కానీ అనంతవరంలో సిఆర్‌డిఎ స్థలంలో ముళ్ల కంపల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి గోశాల నిర్వహిస్తున్నారు. కంటైనర్‌లలో పశువులను కుక్కి గోశాలకు తరలిస్తు న్నారని, దీంతో కొన్ని ఆవులకు కాళ్లు విరగడం, మరికొన్ని తీవ్ర గాయాల పాలవుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. గాయపడ్డ, అనారోగ్యం పాలైన వాటికి ఆహారం, నీరు ఇవ్వక పోవడం, సరైన సంరక్షణ చర్యలు తీసుకోకపోవడంతో మృత్యువాత పడుతున్నాయని చెబుతున్నారు. ఆవులు చనిపోతున్న విషయాన్ని అడిగితే మీ అంతు తేలుస్తామని, కేసులు పెడతామని నిర్వాహకులు బెదిరిస్తున్నారని వాపోతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి తరలించిన ఆవుల్లో బాగున్నవాటిని అమ్ముతున్నారని, ఆహారం, నీరు లేక ఆకలితో అలమటిస్తూ దయనీయ స్థితిలో చనిపోతున్న మూగజీవాలను పూడ్చి వేస్తున్నారని, గోశాల లో రోజుకు 2, 3 ఆవులు ప్రాణాలు విడుస్తున్నాయని చెబు తున్నారు. సిఆర్‌డిఎ స్థలంలో గోసంరక్షణ కేంద్రం ఎలా ఏర్పాటు చేస్తారు? సిఆర్‌డిఎ అధికారుల అనుమతి ఉందా? అనే అనుమానాన్ని కొంతమంది వ్యక్తం చేస్తున్నారు. మూగజీవాల వెతలు గురించి ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌కు చెబితే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని పోలీసు లకు చెప్పడంతో హడావిడిగా కొన్ని నీళ్ల డ్రమ్ములు తెచ్చి పెట్టారని, ఆవులకు ఇంజక్షన్‌లు ఇచ్చి అంతా బ్రహ్మాండంగా ఉన్నట్లు నమ్మబలుకుతున్నారని విమర్శిస్తున్నారు. గోసంరక్షణ కేంద్రంలో అక్రమాలపై సిఆర్‌డిఎ, ప్రభుత్వం విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసు కోవాలని కోరుతున్నారు.

పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి : సిపిఎం



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలరావు, తదితరులు

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని ప్రాంతాల్లో నివసిస్తున్న పేద ప్రజలకు ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని సిపిఎం పలనాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయనమాట్లాడారు. పట్ట ణంలో దాదాపు 20 సంవత్సరాల నివాసాలు ఏర్పాటు చేసు కున్న పేదలు పట్టాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. పట్టణంలోని మార్జిన్, కాలనీ సుందరయ్య నగర్ కాలనీ, వెన్నపూసల కాలనీ, నాగిరెడ్డిపల్లి కాలనీలలో దాదాపు 2500 మంది పేదలు నివసిస్తున్నారని చెప్పారు. వీరితో పాటు అనేకమంది అద్దెఇళ్లలో ఉంటూ అద్దె చెల్లించ లేక ఆర్థిక ఇబ్బందులు దుర్కొంటున్నారని పేర్కొన్నారు. 10 ఏళ్ల కిందట ప్రారంభించిన పిట్ కోళ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ పేదలకు ఇవ్వడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోందని విమర్శించారు. జగనన్న కాలనీ ప్రారంభించి ఐదేళ్లయినా ఇంటి నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. మండలం లో అనేక గ్రామాల్లో అగ్రహారం భూములు సాగు చేసు కుంటున్న వారికి పట్టాలు ఇవ్వాలనీ, పట్టాదారు పాస్ పుస్తకాలు కూడా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పట్ట ణంలో డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని పట్టణ కార్యదర్శి బొంగురు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంచినీటి వ్యవస్థ ను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు సకాలంలో వైద్యం అందిం చాలనీ, పూర్తి సమయం డాక్టర్లు ఉండే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కారంపూడి రోడ్డులో ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని అన్నారు. సమా వేశంలో పార్టీ నాయకులు కే.శివరామకష్ణ, పెనుమాల వెంకటేశ్వర్లు, తిరుమల లక్ష్మి, ఎస్కే రంజాన్ బీ పాల్గొన్నారు.

ఐక్యపోరాటంతోనే ఆశాల సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆశా వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో ఐక్య పోరాటాల తోనే పలు సమస్యలు పరిష్కరించుకున్నట్లు ఏపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షురాలు డి.శివకుమారి అన్నారు. నరసరావుపేట పట్టణం కోటప్పకొండ రోడ్డులోని పల్నాడు విజ్ఞాన కేంద్రం లో ఆదివారం ఏపి ఆశా వర్కర్స్ యూనియన్ పల్నాడు జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షురాలు కె.చంద్రకళ అధ్యక్ష తన జరిగింది. శివకుమారి మాట్లాడుతూ ఆశాల పోరాటాల ఫలితంగా రూ.1.50 లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్, ఉద్యోగ విరమణ వయోపరిమితి 62 ఏళ్లు, 180 రోజులు ప్రసూతి సెలవులు సాధించుకున్నామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమారి

నెలకొన్న అనేక సమస్యలు పరిష్కారానికి ఐక్య పోరాటాలు చేయాల్సి ఉంద న్నారు. గర్భిణులను గ్రామీణ ప్రాంతాల నుంచి పిహెచ్‌సికి, ఏరియా ఆసుపత్రికి తీసుకు వస్తున్న ఆశా వర్కర్లకు ప్రభుత్వం టిఏ, డిఏలు ఇవ్వాలని, పని భారం తగ్గించాలని, పిఎఫ్, ఇఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని అన్నారు. యూని యన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రత్న కుమారి మాట్లాడుతూ ఆశాలకు కనీస వేతనాలు, వారాంతపు సెల వులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సెలవులు వర్తింప చేయాలని, మట్టి ఖర్చులకు రూ 20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల నియామకాలలో రాజకీయ జోక్యం వద్ద న్నారు. ఏఎన్ఎం పోస్టులభర్తీలో ఆశాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆయా సమస్య లు పరిష్కారం కోసం వచ్చే నెల చివరి వారంలో కలెక్టరేట్ వద్దధర్నాకు పిలుపు నిచ్చా మన్నారు. కోశాధికారి ఎం ధనలక్ష్మి, కమిటీ సభ్యులు ఎంచిన్నమ్మాయి, షేక్ మెహరున్నీసా, పి.బుజ్జి, డి.రత్న కుమారి,కె.జోసెఫ్ రాణి, ఎన్‌విక్టోరియా పాల్గొన్నారు.

బెల్లంకొండ జడ్‌పి పాఠశాలలో వర్షపు నీరు



హైస్కూలు ఆవరణంలో నిల్వ ఉన్న వర్షపునీరు

ప్రజాశక్తి - బెల్లంకొండ

బెల్లంకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిల్వ ఉన్న వర్షపు నీటిని బయట పంపించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రవిబాబు బి.నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన సిపిఎం బెల్లంకొండ సమావేశం సందర్భంగా స్థానిక సమస్యలను పరిశీలన చేశారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ 320 విద్యార్థులు చదువుకుంటున్న బెల్లం కొండ హైస్కూల్ ఆవరణంలో వర్షపు నీరు నిల్వ ఉన్నా పట్టించుకోక పోవడం అన్యాయమని అన్నారు. వెంటనే మురుగు నీరు బయటకు పంపటానికి అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ బయట ఆక్రమణలకు గురికావడం వలన వర్షపు నీరు బయటకు వెళ్లే వీలు లేదని తెలిపారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి హైస్కూల్ ఆవరణలో మురుగునీరు తొలగించి విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వాష్‌రూములకు వెళ్లలేకున్నామని విద్యార్థి నులు వాపోయారన్నారు. పారిశుధ్య చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. వీరి వెంట సిపిఎం మండల కార్య దర్శి సిహెచ్ పుల్లారావు నర్సింహారెడ్డి, దుగ్గి కోటేశ్వరరావు, రాజారావు ఉన్నారు.


ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదాం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ప్లాస్టిక్ సంచులు మానవాళికి పెను సవాలుగా మారిం దనీ, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టాలని అమ రావతి సేవ సమితి అధ్యక్షులు గొల్లపల్లి వీరాంజ నేయులు అన్నారు. ప్లాస్టిక్ సంచులు వద్దు.. జ్యూట్ సంచు లే ముద్దు కార్యక్రమంలో భాగంగా అమరావతి సేవాసమితి ఆధ్వర్యం లో సత్తెనపల్లి పట్టణంలో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అన ర్థాల గురించి ప్రజలకు, వ్యాపారులకు ఆదివారం అవగా హన కల్పించారు. ఉపాధ్యాయులు గుండ్లపల్లి కృష్ణ ఆర్థిక సాయంతో పట్టణంలో పండ్ల మార్కెట్, వ్యాపార, వాణిజ్య కూడళ్లలో ప్లాస్టిక్ వాడకంపై అవగాహన కార్య క్రమం చేపట్టి నార సంచులు పంపిణీ చేశారు. ప్లాస్టిక్ సం చులకు వాడితే భవిష్యత్తు తరాలకు పెనుముప్పు తప్పదాని సమితి సభ్యులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి పి.రవిరాజా, సభ్యులు షారోన్ కుమార్, బాలాజీ నాయక్, బబ్బు, తీర్రునాయక్ పాల్గొన్నారు.



నార సంచులు పంపిణీ చేస్తున్న సమితి సభ్యులు



డాక్టర్ గోపిరెడ్డిని, పుల్లారెడ్డిని సత్కరిస్తున్న వైసిపి నాయకులు

వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కనక పుల్లారెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు కనక పుల్లారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు వైసిపి నియోజకవర్గ కార్యాలయంలో వైసిపి నాయకులు అభినందన సభ ఏర్పాటు చేసి వైసిపి పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డిని, కనక పుల్లారెడ్డిని సత్కరించారు. డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ వైసిపిలో కష్టపడిన ప్రతి ఒక్కరికి గుర్తింపు దక్కుతుందని దీనికి నిదర్శనం కనక పుల్లారెడ్డి అన్నారు. ఉప్పలపాడు గ్రామంతో పాటు నరసరావుపేట నియోజక వర్గంలో వైసిపి బలోపేతానికి పుల్లారెడ్డి ఎంతో కృషి చేశా రని కొనియాడారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ తన నియా మకానికి సహకరించిన డాక్టర్ గోపిరెడ్డికి, నియో జకవర్గ వైసిపి సీనియర్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు దక్కిన పదవితో పార్టీ కార్యక్రమాల నిర్వహణ పట్ల తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. వైసిపి బలోపేతం చేస్తూ రానున్న స్థానిక ఎన్నికల నుంచి సార్వత్రిక ఎన్నికల వరకు వైసిపి గెలుపే లక్ష్యంగా సీనియర్ నాయకుల సలహాలు సూచనలతో పని చేస్తామన్నారు. ఈ సందర్భంగా వైసిపి సీనియర్ నాయకులు పుల్లారెడ్డికి అభినందనలు తెలిపారు.



బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

బస్సులు కోసం పడిగాపులు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

దసరా సెలవులు ముగియడంతో ప్రజలు తిరుగు ప్రయా ణమయ్యారు. వివిధ ప్రాంతాల్లో ఉద్యోగు వ్యాపారాలు నిర్వహి స్తున్న వారు దసరా పండుగకు బంధువుల ఇళ్లకు, స్వంత వూళ్ళకు వచ్చారు. సెలవులు ముగియడంతో తిరుగు ప్రయాణ మయ్యారు. సోమవారం నుండి స్కూలు కాలేజీ లు ప్రారంభం కానున్న నేపథ్యంలో సుదూర ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణికులు బస్సులు కోసం పడిగాపులు కాస్తున్నారు. ప్రయాణికుల రద్దీకి తగ్గట్టుగా బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో అవస్థలు పడు తున్నారు. బస్సులు లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్ర యించారు. అధికారుల తీరుపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



70 అడుగుల నుండి జాలువారుతున్న జలపాతం

నాగార్జున కొండకు పోటెత్తిన పర్యాటకులు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జున కొండకు ఆది వారం పర్యాటకులు పోటెత్తారు. నాగార్జున సాగర్ డ్యామ్ గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తుండటంతో ఆంధ్ర-తెలం గాణా రాష్ట్రాల నుంచి పర్యటకులు నాగార్జున సాగర్‌కు చేరు కొని డ్యామ్ గేట్లు తిలకించిన అనంతరం నాగార్జున కొండకు చేరుకుంటు న్నారు. నాగసిరి, అగస్య లాంచీలలో పర్యాటకులు నాగార్జున కొండకు తరలివెళ్లారు. దసరా సెలవులు ముగుస్తుం డడంతో మూడు రోజులుగా నాగార్జున కొండకు పర్యాటకులు భారీగా చేరుకున్నారు. లాంచీ స్టేషన్‌కు ఆదివారం ఒక్కరోజే రూ.1,58,550లు ఆదాయం సమకూరినట్లు టూరిజం అధికారులు తెలిపారు. స్థానిక లాంచీ స్టేషన్ నుంచి నాగార్జున కొండకు వివిధ లాంచీలలో వెళ్లిన పర్యా టకులు కొండలోని మ్యూజియంలో ఉన్న బుద్ధుపి ప్రతిమలు, రాతి పనిముట్లు, మట్టికుండలు, 9 అడుగులబుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్తూపం, అశ్వమేధ శాల, స్నానాల గట్టు, బోధి వృక్షం చూసి తన్మయం చెందారు. అనంతరం పచ్చని కొండల మధ్య ఉన్న అనుపు, యాంపి స్టేడియం, అశ్వమేధయగ్నశాల, శ్రీరంగ నాథస్వామి దేవాల యం, అనంతరం 70అడుగుల నుండి జాలువారే జలపాతాన్ని తిలకించారు. సాగర్ ప్రాజెక్టు గేట్ల నుంచి నీటిని విడుదల చేస్తుండటంతో నూతన బ్రిడ్జి, పాత వంతెన, లాంచీస్టేషన్ కృష్ణవేణి పుష్కర్‌ఘాట్ సందర్శకులతో కిటకిటలాడాయి.



చెరువును తలపిస్తోన్న రోడ్డు

గుంతల మయంగా పొనుగుపాడు రహదారి - కొద్దిపాటి వార్షానికే మునక
ఇబ్బందులు పడుతున్న వాహదారులు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండలంలోని పొనుగుపాడు నుండి గుంటూరు కర్నూలు హైవేకి వెళ్లే మెయిన్ రోడ్డు గుంతల మయమై కొద్దిపాటి వర్షానికే చెరువును తలపిస్తోంది. దీంతో వాహన దారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎన్నోసార్లు ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడి ఆసుపత్రుల పాలయ్యారు. ఈవిషయంపై సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు జిల్లాస్థాయి అధికారులకు అర్జీల రూపంలో తెలిపినా పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రభుత్వాలు ఎన్ని మారిన ఈ రోడ్డు మరమ్మతులు చేసేవారు లేరా అని స్థానిక ప్రజలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు మార్గం గుండా పొనుగుపాడు, గుండాలపాడు, బేతపూడి, ఎర్రగుంట్లపాడు తదితర గ్రామాల ప్రజలు ప్రయాణం చేస్తారు. ఇప్పటికైనా త్వరగా స్పందించి ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు రోడ్డు మరమ్మతులు చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.





చెరువును తలపిస్తోన్న పొనుగుపాడు రోడ్డు

ఆచార్య కృపాచారికి జీవిత సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి - తెనాలి



దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకుల పతి, పట్టణానికి చెందిన ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారికి ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్, యునెస్కో సంయుక్త ఆధ్వర్యంలో జీవితం సాఫల్య పురస్కారాన్ని ప్రకటించింది. క్రైస్తవ సాహిత్యంలో కృపాచారి చేసిన కృషికి గాను పురస్కారం ప్రకటించినట్లు కమిటీ సభ్యులు గద్దపాక విజయరాజు వెల్లడించినట్లు కృపాచారి తెలిపారు. ఈనెల 7న హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించనున్న సభలో ఆయన పురస్కారాన్ని అందుకోనున్నారు. ఈ సందర్భంగా పలువురు కవులు, సాహితీవేత్తలు ఆయనను అభినందించారు.

ఎన్‌సిసితో విద్యార్థులకు మంచి జీవితం

ప్రజాశక్తి - గుంటూరు

ప్రాథమిక సైనిక శిక్షణ అందిస్తూ సమాజంపట్ల వారికి ఉన్న బాధ్యతను నెరవేర్చే విధంగా విద్యార్థులకు ఒక క్రమశిక్షణాయుతమైన జీవితాన్ని అలవర్చేందుకు నేషనల్ క్యాడెట్‌కార్ప్స్ ఎంతో తోడ్పడుతుందని ఏపీ ట్రేక్ అండ్ ట్రేక్ మేనేజర్ కల్నల్ సుదాన్షు దుబే అన్నారు. గత వారం రోజులుగా ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌సిసి క్యాడెట్లకు నిర్వహించిన ట్రేక్ క్యాంప్ ఆదివారం ముగిసింది. ముగింపు సభలో కల్నల్ సుదాన్షు దుబే మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ డైరెక్టరేట్‌లోని 9 గ్రూపులకు సంబంధించిన 510 మంది ఎన్.సి.సి క్యాడెట్లు పాల్గొన్న ఈట్రేక్ క్యాంపులో కోటప్పకొండ, కొండవీడు, విజయవాడ కొండపల్లి ప్రాంతాలలో ఎన్‌సిసి క్యాడెట్స్ ట్రెక్కింగ్ నిర్వహించారని తెలిపారు. ఆర్మీలో సిబ్బంది కొరతను తీర్చే లక్ష్యంతో ఇండియన్ డిఫెన్స్ యాక్ట్ 1917 కింద 1948లో ఎన్‌సిసి ఏర్పడిందని చెప్పారు. పాఠశాల స్థాయి నుండి కళాశాల విద్యార్థులకు ఎన్‌సిసి శిక్షణ అందించటం జరుగుతుందని తెలిపారు. ఎన్‌సిసి ఒకవ్యక్తిని క్రమశిక్షణలో నడిపేందుకు ఎంతో ఉపయోగపడుతుందని, దేశం పట్ల, సమాజం పట్ల బాధ్యతను గుర్తు చేస్తూ సమాజానికి సేవ చేయాలనే భావాన్ని పెంపొందిస్తుందని చెప్పారు. అనంతరం ఎన్‌సిసి క్యాడేట్స్ సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. క్యాడెట్స్‌కు వసతి సౌకర్యం కల్పించి పూర్తిస్థాయిలో తోడ్పాటు అందిస్తున్న కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ కల్నల్ ఉదయ్‌కుమార్, ఎన్‌సిసి సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న ఎన్‌సిసి క్యాడెట్స్

దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలి

కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మల్యాద్రి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన గుర్తు తెలియని దుండగులను ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గుండిమెడ గ్రామంలో చిత్తూరు జిల్లాలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడాన్ని నిరసిస్తూ కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. కెవిపిఎస్ మండల కార్యదర్శి పల్లె కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాల్యాద్రి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం అతి దుర్మార్గమైన చర్య అన్నారు. దళితుల మధ్య తగాదాలు పెట్టడానికి, ఐక్యతను దెబ్బతీసేందుకే ఇలాంటి దుర్మార్గమైన చర్యలు గుర్తు తెలియని వ్యక్తులు చేశారని ఆయన ఆవేదన చెందారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన 11 సంవత్సరాల కాలంలో మత ఘర్షణలు, కులాల మధ్య గొడవలు , దళితులపై దాడులు ఎక్కువగా జరుగు తున్నాయన్నారు. ఏపీలో కూడా దళితులపై దాడులు విపరీతంగా పెరిగాయని ఆయన అన్నారు. దళితులపై జరిగే దాడులను అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. 79 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో నేటికీ దళితులు అంటరానితనం, వివక్షకు గురి అవుతున్నారని ఆయన అన్నారు. తక్షణమే చిత్తూరు జిల్లా, దేవళం పేట అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. నరేంద్ర మోడీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత మతోన్మాద బిజెపి మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా దుర్మార్గమైన చర్యలు చేపడుతుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర రాజధాని పేరుతో 80000 ఎకరాల భూమిని తీసుకునేందుకు పూనుకోవడం జరిగిందన్నారు. ఇదే రాజధాని ప్రాంతంలో దళితులు భూములు కూడా ఉన్నాయని అన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించ లేదన్నారు. అభివృద్ధి పేరుతోను, పరిశ్రమల స్థాపన పేరుతోను పాలక పక్షాలు సేకరిస్తున్న భూములలో దళితులవి కూడా ఉన్నాయన్నారు. బడ్జెట్‌లోనూ, నిధులు కేటాయింపులోనూ దళితులకు గిరిజనులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు జోషి, కెవిపిఎస్ తాడేపల్లి మండల నాయకులు నాగ పోగు విజయ రాజు, బత్తుల సంసోన్, ఎం.చిన్న, ఎం.తంబి, జి.ఏసురత్నం, జి.చిన్నప్ప, ఎం.కృష్ణ, పవన్ పాల్గొన్నారు.





గుండెమెడలో జరిగిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, తుళ్లూరులో కెవిపిఎస్ జెండా ఆవిష్కరణ

దళితులపై దాడులు సిగ్గుచేటు

ప్రజాశక్తి - తుళ్లూరు

స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లయినా దళితులు, బలహీనవర్గాలపై దాడులు జరగడం సిగ్గుచేటని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా కార్యదర్శి జె.నవీన్ ప్రకాష్ అన్నారు. కెవిపిఎస్ 28వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం తుళ్లూరులోని ప్రజా సంఘాల కార్యాలయం వద్ద కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం పతాకాన్ని సంఘం జిల్లా నాయకులు సిగినం కోటేశ్వర రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవీన్ ప్రకాష్ మాట్లాడుతూ, పాలకులు అనుసరిస్తున్న విధానాల వల్లనే దళితులపై నేటికీ దాడులు జరుగుతున్నా యన్నారు. అంబేద్కర్ రాజ్యాంగ రచన సందర్భంగా రాజకీయ సామాజిక ఆర్థిక సమానత్వం ద్వారానే దళితుల అభ్యున్నతి జరుగుతుందని ఆకాంక్షించారని, పాలకులు మాత్రం అందుకు భిన్నంగా స్వప్రయో జనాల కోసం రాజ్యాంగ హక్కులు దక్కకుండా దళితులు మరింత దిగజారేలా చేస్తున్నా రన్నారు. 1998లో ఆవిర్భవించిన కెవిపిఎస్ సమాజంలోని సాంఘీక దురాచారాలతో పాటు దళిత హక్కులు, ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ సాధన కోసం అనేక పోరాటాలు చేసిందన్నారు. ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన నినాదాలతో పోరాటాలు కొనసాగిస్తుందని అన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు పేరం బాబూరావు, పాలడుగు భాగ్యరాజు, శంకరరావు, కంతేటి నాగమల్లేశ్వరరావు, దార్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల జీతం బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - గుంటూరు

అంగన్వాడీలకు ఆగస్టు, సెప్టెంబర్ వేతన బకాయిలు, నితర పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రమణ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. అంగన్‌వాడీలతో గొడ్డు చాకిరీ చేయిస్తున్న రాష్ట్రప్రభుత్వం వారికి నెలనెలా జీతాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతుం దన్నారు. రెండు నెలల జీతాలు, మూడు నెలల సెంటర్ అద్దెలు, నాలుగు నెలల కాండమేంట్స్ బిల్లులు, ఏడాదిపైగా సిబి ఈవెంట్స్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇవన్నీ అంగన్వాడీలు తమ సొంత డబ్బుల నుండి ముందస్తుగా ఖర్చు చేసిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికో చెల్లిస్తుందన్నారు. ఈలోగా అంగన్‌వాడీలు అప్పులపాలు అవుతున్నారన్నారు. పెండింగ్ బిల్లుల కోసం పదే పదే అడగాల్సిన పరిస్థితి నెలకొన్నదని చెప్పారు. పనిచేయని సెల్‌ఫోన్లు ఇచ్చి వాటితోనే సకాలంలో వివరాలు నమోదు చేయలేదని అధికారులు ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. కొత్త ఫోన్లు ఇవ్వాలని కోరుతూ ఆందోళన చేస్తే సెప్టెంబర్‌లోగా ఇస్తామని హామీ ఇచ్చి ఇంత వరకూ ఇవ్వలేదన్నారు. సుదీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న అంగన్వాడీ హెల్పర్ల ప్రమోషను తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీతాలు పెంచి ఆరేళ్లు గడిచిందని, జీతాల పెంపుదలపై ప్రభుత్వం నుండి స్పందన లేదన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.



ఆదివారం సాయంత్రం కురుస్తున్న భారీ వర్షం

ఫిరంగిపురంలో భారీ వర్షం

ప్రజాశక్తి- ఫిరంగిపురం

ఫిరంగిపురం, పలు గ్రామాలలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ కాసిన మధ్యాహ్నం తర్వాత ఆకాశం నల్లగా మేఘాలు కమ్ముకొని ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. పగలంతా ఎండ వేడితో ఇబ్బంది పడ్డ ప్రజలు రైతులు రైతు కూలీలకు వర్షంతో కొంత ఉపశమనం కలిగింది. వర్షం కారణంగా మెట్ట పైరు వేసిన రైతులు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వరి పంట వేసిన రైతులు ఆనందపడ్డారు.

మంగళగిరికి నేడు కేంద్ర మంత్రి రాక

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలోని రాయల్ కన్వెన్షన్‌లో సోమవారం జరిగే ఉచిత వినికిడి మిషన్ నమోదు కార్యక్రమానికి కేంద్ర మంత్రి రామదాస్ అత్వాలే హాజరు కానున్నారని ఆర్‌పిఐ(ఏ) పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కొమ్మారెడ్డి బ్రహ్మానంద రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ మహిళ అధ్యక్షురాలు సీమ అత్వాలే హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చెముడు పరీక్ష చేసి వినికిడి లోపం ఉన్నవారికి మిషన్ ఉచితంగా అందజేస్తామని తెలిపారు.

సెలూన్, స్పా కేంద్రాల్లో అవగాహన కల్పించాలి

జిల్లా సంయుక్త కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

ప్రజాశక్తి - గుంటూరు

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా సెలూన్, స్పా తదితర వాణిజ్య కార్యకలాపాలు గల కేంద్రాల్లో సోమవారం పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా సంయుక్త కలెక్టర్ జాయింట్ కలెక్టర్ అశు తోష్ శ్రీవాస్తవ సంబంధిత అధికారులను ఆదేశించారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై ఆదివారం సంబంధిత అధికారులతో జేసీ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ నెల 7, 8 తేదీలలో జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు తదితర అన్ని విద్యాసంస్థలలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై కార్యక్రమాలు నిర్వహించాలని విద్యాశాఖ అధికారులను ఆయన ఆదేశిం చారు. ఇందు కోసం వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం తదితర పోటీలు నిర్వహించా లన్నారు. కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న కార్యక్ర మాల ఫోటోలు, వీడియోలను సంబంధిత పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాల న్నారు. టెలి కాన్ఫరెన్స్‌లో జిఎస్‌టి జాయింట్ కమిషనర్ బి.గీతామాధురి, డిఇఒ సి.వి.రేణుక తదితరులు పాల్గొన్నారు.



మినిగోకులం షెడ్‌కు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

కూటమి సారధ్యంలో సంక్షేమం పరుగులు

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి - వెల్దుర్తి

సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో సంక్షే మాన్ని కూటమి ప్రభుత్వం పరుగులు పెట్టిస్తోందని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మండాది గ్రామంలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా మినిగోకులం షెడ్‌కు ఎమ్మెల్యే భూమి పూజ చేసి, శాస్త్రోక్తంగా శంకుస్థాపన చేశారు. అభివృద్ధి, సంక్షే మమే కొలమానంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేయడం హర్షనీయమన్నారు. ఎంపీడివో ప్రసాద్, పంచాయితీ ఏఈ పాశం శ్రీనివాసరెడ్డి, పంచాయతీ సెక్రటరి ప్రసాద్, ఏపీవో రేఖాజ్యోతి, టీడీపీ తెలుగు యువత ఆర్గ నైజింగ్ సెక్రటరి కుర్రి శివారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు గుజ్జుల పాపిరెడ్డి, చిన్నపురెడ్డి అంకిరెడ్డి, అన్నపురెడ్డి రామ లింగారెడ్డి, మూల వెంకట చెన్నారెడ్డి, సుంకరకొండా, ఎం.రోశిరెడ్డి, గన్నవరపు గాలయ్య, దేశం లక్ష్మారెడ్డి, గన్నవరపు కేశవ పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

గోశాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కారంపూడి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని స్థానిక శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఆదివారం వినుకొండ రోడ్డులోని యానాది కాలనీలో రెండు మిని గోకులాల షెడ్లకు భూమిపూజ చేసి, శాస్త్రోక్తంగా శంకు స్థాపన క్రతువును నిర్వహించారు. సేద్యానికి ఊతానిచ్చే పశు పోషణకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీఠ వేస్తున్నాయి ఆయన గుర్తు చేశారు. ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, పంగులూరి పుల్లయ్య, సర్పంచ్ సరస్వతి బాలునాయక్, మండల పార్టీ అధ్యక్షులు గోళ్ల సురేష్ యాదవ్, ఉన్నం లక్ష్మీనారాయణ, చప్పిడి రాము, బొల్నేడి శ్రీనివాసరావు, మునిగోటి సత్యం, బొమ్మిన శేషగిరి రావు, బాలకష్ణ, తండా మస్తాన్‌జానీ పాల్గొన్నారు.

నేడు పెదకూరపాడులో రీసర్వే

ప్రజాశక్తి - పెదకూరపాడు

పెదకూరపాడులోని పొలాల రీసర్వే సోమవారం నుంచి ప్రారంభమవుతుందని పెదకూరపాడు మండల తహశీల్దార్ ఎన్.ధనలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామం లో రీ సర్వే కొరకు మూడు టీములు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రైతులందరూ సహకరించాలని ఆమె కోరారు.

ప్రయాణికులు రెట్టింపైనా పెరగని సర్వీసులు

రద్దీతో చిన్నారులు, వృద్ధులు ఉక్కిరిబిక్కిరి



బస్సు ఎక్కుతున్న ప్రయాణీకులు



బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ప్రభుత్వం మహిళలకు ఉచ్చితంగా 5 రకాల బస్సులలో ప్రయాణ సౌకర్యం ఈ సంవత్సరం ఆగస్టు 16వ తేది నుంచి స్త్రీ శక్తి పథకం ద్వారా అమలు చేసింది. అప్పట్నుంచి పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ ప్రెస్, ఎక్స్ ప్రెస్ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిం చేందుకు అనుమతి ఇచ్చింది. నరసరావు పేట రీజియన్‌గా పట్టణంలో ఉన్న బస్సు డిపోలో 78బస్సులున్నాయి. అందులో ప్రభుత్వా నికి అనుగుణంగా ప్యాసింజర్ బస్సులు 37, ఎక్స్‌ప్రెస్ బస్సులు 7 ఉన్నాయి. ఉచ్చిత బస్సు పథకం అమలైన నాటి నుంచి ఇప్పటి వరకు నెల గతంలో 28 వేలు మంది ప్రయాణం చేస్తే ఈ పథకం కింద ప్రతి నెల 39వేల మంది మహిళలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారు. ఉచ్చిత బస్సు ప్రయాణం పథకం అమలైన తర్వాత మహిళా ప్రమాణికుల సంఖ్య ఊహించనంతగా విపరీతంగా పెరిగింది. స్త్రీ శక్తి పథకం అమలుకు ముందు, తర్వాత కూడా అదే సంఖ్యలో పల్లె వెలుగు ఎక్స్ ప్రెస్ సర్వీసులు నడుస్తుండటంతో విపరీత మైన రద్దీ నెలకొంది. సాధారణ రోజుల్లో ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు సాయంత్రం ఐదు నుండి ఏనిమిది గంటల వరకు విద్యార్థులు, ఉద్యోగులు ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. ఈ వేళల్లో రద్దీ ఉంటోంది. వృద్ధులు, మహిళలు, చిన్నారులు రద్దీ వల్ల నిలబడే ప్రయాణిస్తున్నారు. కొంత మంది మహిళలు ఉచ్చిత బస్సుల్లో ప్రయా ణించలేక సూపర్‌లగ్జరీ వంటి బస్సులను ఆశ్రయి స్తున్నారు. సీట్లు కోసం బస్సుల్లోనే కొట్టుకుంటున్న ఘటనలూ నమోదవుతున్నాయి. బస్సుల్లో గొడవలు పడటం నిత్య కృత్యంగా మారింది. టిక్కెట్ తీసుకుని ప్రయాణిస్తున్న వారు సీట్లు లేక ఇబ్బందిపడుతున్నారు. ప్రయాణాలు పెరిగినా ప్రభుత్వం ఆదనంగా బస్సులు నడపకపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందంటున్నారు. దసరా నేపథ్యంలో మరింత రద్దీ చిలకలూరిపేట నుంచి విజయవాడ 70కి.మీ. అందు లోనూ ప్రముఖంగా ఇంద్ర కీలాద్రిపై అమ్మవారు నిలయమై ఉండటంతో దసరా పండుగను పురస్కరించు కొని రద్దీ విపరీతంగా పెరిగింది. ఇటు ఒంగోలు నుంచి గుంటూరు దాకా నడిపే పాసింజర్ బస్సులు కూడా ఆ డిపోవారు బస్సుల రద్దీని చూసిపెంచక పోవటంతో ఒంగోలు వైపు నుంచి బస్సులు అక్కడే నిండి వస్తున్నాయి. వృద్ధులు, పిల్లలు మారి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పండుగ రోజుల్లో ప్రత్యేక దినాల్లో బస్సులను పెంచాలని మహిళలతో పాటు టిక్కెట్టుకొని ప్రయాణించే వారు కోరు తున్నారు. కొన్ని సమయాల్లో తోలు గేట్లకు ఇతర ఖర్చులకు ప్రత్యేకంగా డిపో నుంచి డబ్బులు తీస కోవాల్సి వస్తుందని కండక్టర్లు అంటున్నారు. గతంలో చిలకలూరి పేట నుంచి విజయవాడకు పోతే సుమారు రూ.39 వేలు కలెక్షన్ వచ్చే దనీ, ప్రస్తుతం రొక్కంగా రూ.11వేలు వస్తుందని 29,000 మహిళా శక్తిగా పోతున్నాయన్నారు. చిలక లూరిపేట నుంచి గుంటూరుకు పోయి వస్తే 11000 నగదు వచ్చేయని ప్రస్తుతం మహిళా శక్తి కింద రూ.9వేలు, రొక్కంగా రూ.2 వేలు వస్తున్నాయన్నారు. ఇప్పటికీ చిలకలూరిపేట డిపోకి ప్రభుత్వం వారి నుంచి లక్షల్లో బకాయిలు పడింది. ప్రభు త్వం ఎప్పుడు చెల్లిస్తుందోనని ఎదురు చూస్తున్నామని ఆర్టీసీ అధికారులు అంటున్నారు.

మాజీ సర్పంచ్ గురవయ్య మృతి



గురవయ్యకు నివాళి అర్పిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి - యడ్లపాడు

అనారోగ్య కారణంగా కొత్తపాలెం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ పల్నాటి గురవయ్య (60) మృతి చెందారు. గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు...2001-2006 మధ్య కాలంలో ఆయన సర్పంచ్‌గా కొనసాగారు. ఇటీవల కాలంలో ఆయనకు రెండు కిడ్నీలు పాడయ్యాయి. రెండు రోజులు కిందట అనారోగ్యంగా ఉండటంతో కుటుంబ సభ్యు లు గుంటూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారిం చారు. ఆయన భౌతిక కాయాన్ని ఆదివారం గ్రామానికి తీసుకువచ్చి గ్రామంలోని హిందూ శ్మశాన వాటిక లో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు భార్య కుమారి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతి సమాచారం తెలుసు కుని వైసిపి యడ్లపాడు మండల అధ్యక్షులు వడ్డేపల్లి నరసింహారావు, నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త కమిటీ సభ్యులు ఆర్.చింతారావు, కొత్తపాలెం సర్పంచ్ ఎం.సాంబయ్య, నాయకులు టి.కోటయ్య, పి. పెద్ద అంజయ్య, ఎం. విజయబాలచంద్రారెడ్డి, పి. శ్రీనివాసరరెడ్డి, పఠాన్ రెహమాన్, జాకీర్‌హుస్సేన్ పాల్గొని నివాళి అర్పించి కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు.

వైసిపి స్టేట్ ఎస్ఇసి మెంబర్‌గా చలమారెడ్డి

ప్రజాశక్తి - మాచర్ల

వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఇసి)మెంబర్‌గా నియమితులైన కొమ్మారెడ్డి చలమారెడ్డిని మాచర్ల మాజీ ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు అభినందించి, శాలువాతో సన్మానించారు. చలమారెడ్డి మాట్లాడుతూ వైసిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి తనకు అప్ప చెప్పిన బాధ్యతలు చిత్తశుద్ధితో నిర్వహిస్తూ, పార్టీ బలోపే తానికి తన వంతు కృషి చేస్తానన్నారు. మాచర్ల అసెంబ్లీ నియో జకవర్గం మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా పఠాన్ సత్తార్ ఖాన్ నూతనంగా నియమితులైన సందర్భంగా రామకృష్ణా రెడ్డిని కలిసి దుశ్శాలువాతో సత్కరిం చారు.



చలమారెడ్డిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిలిపివేయండి : వైసిపి

ప్రజాశక్తి - కారంపూడి

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రైవేటికరణ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకస్తు న్నట్లు పల్నాడు జిల్లా ఎస్సి సెల్ అధ్యక్షులు కొమ్ము. చంద్రశేఖర్, వైసిపి ఎస్సి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శామ్యూల్ అన్నారు. ఆదివారం వారు కారం పూడిలో మీడియాతో మాట్లాడుతూ వైఎస్. జగన్ మెహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిర్మించిన ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రస్తుత ఎన్‌డిఏ ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలని చూస్తోందనీ, ప్రభుత్వం ఇప్పటి కైనా ప్రైవేటీకరణ చర్యలు నిలిపివేయాలని వారు ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో దేశ చరిత్రలోనే కనివిని ఎరుగని రీతిలో 17 నూతన ప్రభుత్వ కళాశాలలు స్థాపించ బడ్డాయనీ, వాటిలో కొన్ని కళాశాలలలో తరగతులు కూడా ప్రారంభం అయ్యాయని అన్నారు. ఇలాంటి నిర్ణయాల వలన పేద, మధ్య తరగతి విద్యార్థులు వైద్యవిద్యను చదివే అవకాశాన్ని కోల్పోతారని ఆరోగ్య సేవలు సైతం వాణిజ్య రంగంగా మారి ప్రభుత్వ ఆసుపత్రులు బలహీనపడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ సంక్షేమం కోరుకునే పౌరులు వైద్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వవిద్యార్థులు, ప్రజా సంక్షేమం కోరుకునే వారందరు వైద్య, విద్య, ఆరోగ్య సేవల ను కాపాడేందుకు ఏకతాటిపై నిలబడి మెడికల్ కాలేజీల ప్రైవేటికరణను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఈపూరు

కొచ్చర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కొండ్రముట్ల ఫీడర్ మరమ్మత్తుల కారణంగా నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఎస్.గాంధీబాబు ఆది వారం తెలిపారు. కొండ్రముట్ల, దాసులపల్లి, దుష్మాన్‌పేట, సత్యనారాయణపురం, కొత్త నెల్లూరు, కొండ్రముట్లపాలెం గ్రామాలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం మూడు గంట ల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. త్రీఫేస్ సరఫరా రాత్రి రెండు నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు, మధ్యాహ్నం మూడు గంటల తర్వాత ఇవ్వ నున్నట్లు ఏఈ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహక రించాలని ఆయన కోరారు.

ప్రజాశక్తి - యడ్లపాడు

యడ్లపాడు మండలంలోని పుట్టకోట గ్రామంలో ఆర్‌డి ఎస్ఎస్ పనులలో భాగంగా సోమవారం విద్యుత్ లైన్లు, మర మత్తులు ఉన్నందున ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు గృహ, వాణిజ్య, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఆర్.అశోక్ కుమార్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తెలి పారు. విద్యుత్‌వినియోగదారులు సహకరించాలని కోరారు.

యాచకురాలికి అంత్యక్రియలు

ప్రజాశక్తి - మాచర్ల



మృతదేహాన్ని ఖననం చేస్తున్న గోవిందరెడ్డి

పల్నాడు జిల్లా మాచర్ల రైల్వేస్టేషన్లో గుర్తు తెలియని మహిళ మృతదేహం పడి ఉండ టం గమనించిన మాచర్ల రైల్వే స్టేషన్ సిబ్బంది నడికుడి రైల్వే పోలీసు లకు విషయం తెలియ జేశారు. వారు మాచర్ల రైల్వేస్టేషన్‌కి వచ్చి ఎంక్వయిరీ చేయగా రోజు ఆ మహిళ భిక్షాటన చేస్తూ మాచర్ల రైల్వే స్టేషన్‌లోనే ఉండి స్వామి వివేకా నంద ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందించే ఆహారంతోనే జీవన కొనసా గిస్తున్నట్లు తెలుసు కున్నారు. ఆ తర్వాత నడికుడి నుంచి వచ్చిన రైల్వే పోలీ సులు మృతదేహాన్ని మాచర్ల గవర్నమెంట్ హాస్పిటల్‌లోని మార్చురీకి తరలించి నాలుగు రోజులు అక్కడే వుంచారు. ఎవరూ రాకపోవడంతో స్వామి వివేకా నంద ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ మెట్టు గోవిందరెడ్డిని నడికుడి రైల్వే ఎస్పైని సంప్రదించి, అంత్య క్రియలు నిర్వ హించాలని కోరుతూ లెటర్‌ను అందజేశారు. గోవిందరెడ్డి స్పందించి తమ సభ్యులతో మాచర్ల డంపింగ్ యార్డ్ దగ్గర శవాన్ని ఖననం చేశ్రూరు. కార్యక్రమంలో వినయ్, నరసింహ, వెంకటేష్, అజయ్ కృష్ణ, అజయ్ పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న ఆటో డ్రైవర్లు

సిఎం, డిప్యూటీ సిఎం చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక కొత్తపేట 1, 2 వార్డులలో ఆటో సోదరులు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, విద్యా ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు ఆదివారం పాలాభిషేకం చేశారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు మాజీ కౌన్సిలర్ రంగిశెట్టి నరేంద్ర (బాబి),శివాలయం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ సుఖమంచి గిరీబాబు, టౌన్ కమిటీ మెంబర్ తాడిగిరి సుధీర్, 2వ వార్డు అధ్యక్షులు కట్టా దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఫణిదపు మల్లేశ్వరరావు, 1వ వార్డు అధ్యక్షుడు సైనాదం శ్రీనివాసరావు, పూజల శ్రీనివాసరావు పెద్దబ్బాయి, మంగళగిరి శ్రీనివాసరావు, బండారు రమేష్, కె.దుర్గారావు, సజ్జా సాయికుమార్, రాగవరపు గోపి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కేన్సర్ మహమ్మారితో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు

కేన్సర్ పట్ల అప్రమత్తంగా ఉంటూ సరైన జీవన విధానం ద్వారా కేన్సర్ ప్రమాదాన్ని నివారించ వచ్చని డాక్టర్ రాజీవ్ మోహన్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య సభలో డాక్టర్ రాజీవ్ మోహన్ మాట్లాడారు. ఇటీవల క్యాన్సర్ బాధితుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని, దీనికి ముఖ్యకారణం ఆహారపు ఆలవాట్లు, వాయు కాలుష్యం, ధూమపానమని తెలిపారు. ధూమపానం, మద్యపానం చేసేవారిలో వారి డీఎన్‌ఏలో మార్పులు చెంది సాధారణ పద్ధతిలో కణవిభజన జరగటం వల్ల క్యాన్సర్‌వ్యాధి బారిన పడుతున్నారన్నారు. దురలవాట్లు ఉన్న లేకున్నా కేన్సర్ బారిన పడుతున్నారని, దీనికి వాతావరణ కాలుష్యం, ప్లాస్టిక్ వాడకం, ప్రాసెస్‌డ్ హారం తినటం, టేస్టింగ్‌సాల్ట్, ఫుడ్ కలర్స్ వాడటం, బాగా కాగిన నూనెలో వేయించిన పదార్థాలు తినటం కారణమని వివరించారు. ఏ ఆహార పదార్థానికైనా కాలపరిమితి ఉంటుందని, ఆ పదార్థం నిల్వ ఉండటానికి కొన్ని రసాయనాలు కలపటం వల్ల వాటిని మనం వినియోగిస్తే దురలవాట్లు లేనప్పటికీ కేన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. కావున దురవాట్లకు దూరంగా ఉండటంతోపాటు, ఆహార జాగ్రత్తలు కూడా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. కేన్సర్‌ను మొదటి మూడు దశలలో గుర్తిస్తే వైద్యం చేయడం ప్రస్తుత ఆధునిక వైద్యవిధానంలో చాలా సులభమని, నాల్గవ దశలో గుర్తిస్తే వారి జీవన ప్రమాణాన్ని కొంతవరకు మెరుగుచేయొచ్చని అన్నారు. సాధారణంగా బ్రెస్ట్ కేన్సర్, సర్వైకల్ కేన్సర్ మహిళలలో వస్తుందన్నారు. సర్వైకల్ కేన్సర్‌కు వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నాయని, బాలికలకు 12 ఏళ్లలోపు వ్యాక్సిన్ వేయిస్తే వారికి జీవితంలో సర్వైకల్ కేన్సర్ రాకుండా కాపాడుకోవచ్చని చెపాపరు. పురుషుల్లో వచ్చే ప్రోస్టేట్ క్యాన్సర్ గురించి వివరిస్తూ ఈ సందర్భంలో మూత్రం సన్నగా రావడం, మూత్రంలో రక్తం రావడం తరచూ మూత్రం రావడం తరచూ ఇన్ఫెక్షన్లు రావడం లాంటి లక్షణాలు కనబడతాయని, ఈ లక్షణాలు కనబడిన వెంటనే డాక్టర్‌ను సంప్రదించి చికిత్స తీసుకోవాలని సూచించారు. ఫ్యాటీలివర్ గుర్తించి, కేన్సర్‌కు అందుబాటులో ఉన్న వైద్య చికిత్సల గురించి వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజీవ్ మోహన్‌ను అవగాహన సభ్యులు సత్కరించారు. సభకు కో-ఆర్డినేటర్‌గా టివి.సాయిరాం వ్యవహరించగా, వేమన ట్రస్ట్ అధ్యక్షులు చల్లా అంజిరెడ్డి, విశ్రాంత బ్యాంకు మేనేజర్ ఎన్.సాంబశివరావు, ఒమేగా హాస్పిటల్ పిఆర్ఓ కె.రాంబాబు మాట్లాడారు.



ఉచిత మెగా మెడికల్ క్యాంప్ విజయవంతం

ప్రజాశక్తి - పెదనందిపాడు


ముద్దన నాగరాజ కుమారి, నర్రా బాలకృష్ణ ఆధ్వర్యంలో నర్రా సుబ్బరామయ్య జ్ఞాపకార్థం రోటరీ క్లబ్ సహకారంతో పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం, కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. కాటూరి మెడికల్ కాలేజీ అండ్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఈ క్యాంపు నిర్వహించారు.వైద్య శిబిరాన్ని నర్రా సుబరామయ్య ధర్మపత్ని నర్రా మహాలక్షి ప్రారంభించారు. కాటూరి మెడికల్ కళాశాల వైద్య సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. మెడికల్ క్యాంపులో జిల్లాలోని మొట్టమొదటిసారిగా అత్యాధునిక సౌకర్యాలతో కూడిన బస్సులో ఆధునిక వైద్య పరికరాలతో నిర్వహించారు. జనరల్ మెడిసిన్, సాధారణ వ్యాధి వైద్య నిపుణులు, గుండెకు సంబంధించిన వైద్య నిపుణులు, స్త్రీ సంబంధిత వ్యాధి వైద్య నిపుణులు, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు, చెవి ముక్కు గొంతు సంబంధించిన వైద్య నిపుణులు, కంటి వైద్య నిపుణులు, గజ్జి తామర ఎలర్జీకి సంబంధించిన వైద్య నిపుణులు, ఆయాసం దగ్గు, టిబి, నిమ్ము ఊపిరితిత్తుల వైద్య నిపుణులు, వరిబీజం హెర్నియా లూటి మొదలగు అన్ని జనరల్ సర్జరీలకు సంబంధించిన వైద్య నిపుణులచే నిర్వహించబడిన ఉచిత మెగా వైద్య శిబిరానికి పెదనందిపాడు మరియు పరిసర ప్రాంతాల



మెడికల్ క్యాంపును ప్రారంభిస్తున్న నర్రా మహాలక్ష్మి

నుండి విచ్చేసిన 350 మందికి వివిధ రకాలైన వైద్య సేవలు అందించడమే కాకుండా వారికి ఉచితంగా మందులు అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో నర్రా బాలకృష్ణ, నర్రా మహాలక్ష్మి, రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ పోపూరి లక్ష్మీనారాయణ, డిస్ట్రిక్ట్ అసిస్టెంట్ గవర్నర్ పోలిశెట్టి వీర రాఘవయ్య, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వీర రాఘవయ్య, ఆళ్ళ హరిప్రసాద్, కెప్టెన్ డాక్టర్ పాతూరి శ్రీనివాస్, కాటూరి మెడికల్ హాస్పిటల్ వైద్య బృందం, స్టాఫ్ మెంబెర్స్, కళాశాల, నంది పాఠశాల సిబ్బంది, ఎన్‌సిసి క్యాడెట్స్ పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి పాలకవర్గ సభ్యులుగా శంకరశెట్టి పిచ్చయ్య



పిచ్చయ్యను సన్మానిస్తున్న కాట్రగడ్డ మధుసూధనరావు, బాబు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

శ్రీకాళహస్తి శ్రీశైలం దేవస్థానం పాలకవర్గం సభ్యులుగా నియమితులైన ఇప్పటం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు శంకరశెట్టి పిచ్చయ్యను ఆదివారం పలువురు టిడిపి నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. వడ్డేశ్వరం టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూధనరావు పిచ్చయ్యకు శాలువా కప్పి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పిచ్చయ్య మాట్లాడుతూ తనను దేవస్థానం మెంబర్‌గా నియమించిన ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు, సీఎం చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలియజేశారు. అభినందనలు తెలిపిన వారిలో వడ్డేశ్వరం గ్రామ టిడిపి అధ్యక్షులు ఈపూరి బాబు, ఇప్పటం గ్రామ టిడిపి అధ్యక్షులు జెముడు గాని రత్తయ్య, నాయకులు చావలి సురేష్, వెలగపూడి కిషోర్ బాబు, షేక్ నాగూర్‌వలి, షేక్ ఇమాంసా, మస్తాన్‌వలి, వి.ప్రసాద్, అప్పారావు తదితరులు ఉన్నారు.

దాతల చేయూతతో శ్మశాన వాటికలో సౌకర్యాలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

స్థానిక హిందూ శ్మశాన వాటికలో సౌకర్యాలు దాతల సహకారంతో ఇబ్బందులు తొలగాయి. దహన సంస్కారాలు చేసుకునే వారి పడుతున్న ఇక్కట్లు గమనించిన దాతలు సుమారు 16.5 లక్షలు వెచ్చించి శ్మశాన వాటికలో సౌకర్యాలు కల్పించారు. దహన సంస్కార మండపం నీ గుజ్జులా శ్రీనివాసుల రెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు గురుగురి ప్రతిభ రెడ్డి, పాశం ప్రగతి రెడ్డి(సురక్ష హాస్పటల్ గుంటూరు) 9 లక్షలతో నిర్మించారు. విశ్రాంతి భవనాన్ని గ్రామానికి చెందిన బాపతు సాంబ శివారెడ్డి, రజిని దంపతులు 7.5 లక్షలతో నిర్మించారు. ఉల్లంగుల విజయ్ కాటి కాపరి విగ్రహాన్ని ఏర్పాటు చేపించారు అస్తికల లాకర్, మార్చ్యూరి బాక్స్, స్టీల్ పాడే మరి కొంత మంది దాతలు సమకూర్చారు. ఆదివారం



దాతల సాయంతో నిర్మించిన దహన సంస్కార మండపం, ప్రారంభిస్తున్న డాక్టర్ పి.ప్రగతి రెడ్డి

ప్రారంభం సందర్భంగా గ్రామ పెద్దలు దాతలను ఘనంగా సత్కరించారు. వీటితో పాటు స్పందన సంస్థల డైరెక్టర్ పద్మజ రెడ్డి శ్మశానంలో సిమెంట్ రోడ్డు 8 లక్షల రూపాయలు వ్యయంతో ఏర్పాటు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.చంద్ర శేఖర్ రెడ్డి,వీ.విజయ్ కుమార్, బాపతు శ్రీనివాస్ రెడ్డి, నూతల పాటి అమర్,మల్లం రామకృష్ణ పాల్గొన్నారు.

సామాన్యులకు ఆర్థిక భరోసా సిఎం సహాయనిధి



చెక్కు అందజేస్తున్న మంత్రి మనోహర్

ప్రజాశక్తి - తెనాలిరూరల్

ముఖ్యమంత్రి సహాయనిధి సామాన్యులకు ఆర్థిక బరోసా కల్పిస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం స్థానిక జనసేన క్యాంపు కార్యలయంలో నిర్వహించిన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ప్రజా సమస్యలపై పలువురు నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. మంత్రి మనోహర్ మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా స్థానికంగా 32 మంది లబ్ధిదారులకు రూ. 19.70 లక్షలు విలువ చేసే ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశామన్నారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటివరకూ 275 మంది లబ్ధిదారులకు రూ. 3.26 కోట్లు విలువచేసే సిఎం రిలీఫ్ ఫండ్ నిధులను అందజేసామన్నారు. అనారోగ్యంతో ఆసుపత్రి పాలైన రోగులకు వైద్య ఖర్చులు నిమిత్తం సిఎంఆర్ఎఫ్ సంజీవనిలా దోహదపడుతుందని పేర్కొన్నారు. సామాన్యులకు ప్రభుత్వ, ప్రయివేటు వైద్యశాలల్లో వైద్యసేవలు అందించేందుకు రూ. 25 లక్షలు వరకూ వైద్య భీమా అందించేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వైద్య సహాయం నిమిత్తం సిఎం చంద్రబాబు అందించిన నిధులను తమకు అందేలా కృషి చేసిన మంత్రి మనోహర్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

306వ రోజుకు కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

చట్టపరంగా తమకు రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆది వారం నాటికి 306వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ కార్యదర్శి కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్య పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైనది కాదని విమర్శించారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించి తన శతశుద్ధిని నిరూపించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. దీక్షల్లో జి.వెంకటేశ్వర్లు, బి.సూర్యప్రకాష్, వై.సాంబశివరావు, డి.నాగేశ్వరరావు కూర్చున్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, గురవయ్య, అంకయ్య, జానీ బాషా, ఆశీర్వాదం పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్‌ను సందర్శించిన ఎమ్మెల్యే ధూళిపాళ్ల

ప్రాణకోటికి నీరే జీవనాధారం

ప్రజాశక్తి - పొన్నూరు

సృష్టిలోని ప్రాణకోటికి నీరు జీవనాధారమని స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. నిడుబ్రోలు లోని వాటర్ ప్లాంట్‌ను శాసనసభ్యులు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆదివారం సందర్శించి సిబ్బందికి సూచనలు చేశారు. మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు శాసనసభ్యుల ఆశయాలకు అనుగుణంగా వాటర్ ప్లాంట్ సిబ్బంది సహాయ సహకారాలతో పరిసరాలను శుభ్రపరచి, తుప్పు పట్టిన బ్రిడ్జిని, వివిధ పరికరాలను రిపేర్లు చేయించి వాటికి రంగులు వేయించి అందంగా తీర్చి దిద్దుతామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాటర్ ప్లాంట్ పరిసరాల అభివృద్ధి కోసం ప్రభుత్వానికి విన్నవించి జరిగిందనిత్వరలో వాటర్ ప్లాంట్ వద్ద ఒక మహా అద్భుత ప్రదేశాన్ని పట్టణ వాసులు చూడబోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అభివృద్ధి కమిటీ కన్వీనర్ షేక్ యాసిన్ బాబా, మున్సిపల్ సిబ్బంది, కూటమి నేతల పాల్గొన్నారు.



ఆనందరావును సన్మానిస్తున్న కందుల ఝాన్సీ, తదితరులు

గ్రంథాలయంలో అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం

ప్రజాశక్తి - గుంటూరు

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 'కం టు ద లైబ్రరీ ఎవిరీ సండే' కార్యక్రమం, 'అంతర్జాతీయ ఉపాధ్యాయుల దినోత్సవం' ఆదివారం నిర్వహించారు. ఉప గ్రంథాలయ పాలకురాలు కందుల ఝాన్సీలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రధానోపాధ్యాయులు కొల్లిపర ఆనందరావును సత్కరించారు. ఝాన్సీలక్ష్మి మాట్లాడుతూ 1966లో యునెస్కో అక్టోబర్ 5న స్టేటస్ ఆఫ్ ది టీచర్స్ అనే పత్రాన్ని ఆమోదించిందని, 1994సంవత్సరం నుండి ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. గురువును సన్మానించుకోవడం ఎంతో ఆనందదాయకమని చెప్పారు.



సత్కారం అందుకున్న ఉపాధ్యాయులతో జస్టిస్ వెంకటేశ్వర్లు, కె.ఎస్.లక్ష్మణరావు

ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయం లేదు

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంటూరు

పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయం లేదని రాష్ట్ర హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు అన్నారు. వి.ఎస్.ఆర్. ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో ఉత్తమ గురుకుల ఉపాధ్యాయులకు అవార్డులు ప్రధానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేడు అనేక రంగాలతో పాటు విద్యా రంగంలోనూ ఏఐ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తుందన్నారు. అయితే విద్యలో ముఖ్యంగా ఎలిమెంటరీ, హైస్కూల్ విద్యలో ఉపాధ్యాయులకు ఎ.ఐ వంటివి ప్రత్యామ్నాయం కాలేవని చెప్పారు. బోధన వృత్తి కాదని, జీవితాంతం కొనసాగే ప్రక్రియ అన్నారు. మిగిలిన వఅత్తుల మాదిరిగా రిటైర్మెంట్‌తో ఉపాధ్యాయ వఅత్తి ముగిసిపోదని చెప్పారు. విద్యార్థులను కంటితో కాకుండా మనసుతో చూడాలని, ఆ పని ఏఐ చేయలేదని అన్నారు. గురుకుల విద్యాలయాల్లో విద్యను అభ్యసించి, ఎంతోమంది ఉన్నతాధికారులుగా ఎదిగారని, అటువంటి విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులకు పురస్కారాలు ఇవ్వటం అభినందనీయం ఆన్నారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా గురుకులాలు అత్యున్నత విద్యా ఫలితాలు అందిస్తున్నాకానీ రాష్ట్ర ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపటం బాధాకరం అన్నారు. కూటమి ప్రభుత్వం గురుకుల విద్యపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ డైరెక్టర్ ఎ.కృష్ణ మోహన్ మాట్లాడుతూ విద్యాభివృద్ధిని సూచించే గ్రంథాలయాల వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. తాడికొండ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.మధుసూధనరావు మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలి గురుకుల పాఠశాల అయిన తాడికొండ రెసిడెన్షియల్ స్కూలు రాజధాని పరిధిలోనే ఉండటం ఆనందకరమని, దానిని పూర్వస్థితికి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ వి.మరియరోజా మాట్లాడుతూ ఈకృషిని భవిష్యత్‌లోనూ కొనసాగిస్తామని చెప్పారు. అనంతరం అతిథుల చేతులమీదుగా రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన 13 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. విఎస్ఆర్ ఫౌండేషన్ ఆహ్వాన కమిటి కన్వీనర్ డాక్టర్ పి.వి.మల్లేశ్వర్, రాపోలు జగన్, డి.గోవిందరెడ్డి, ఎ.చంద్రశేఖర్ పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సజీలా, హెబ్జా పటేల్

రొమ్ము కేన్సర్‌పై కిమ్స్‌చక్ర ఆధ్వర్యంలో అవగాహన

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక బృందావన్‌గార్డెన్స్, ఎన్టీఆర్ స్టేడియం వద్ద కిమ్స్ చక్ర క్యాన్సర్ సెంటర్, ఆధ్వర్యంలో ఆదివారం రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం, వాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ సజీలా, సిమ్స్ అధినేత బి. శివ శిరీష, సినీనటి హెబ్బా పటేల్ ముఖ్య అతిథులుగా హాజరై, మహిళలలో రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలనే అవసరాన్ని వివరించారు.కిమ్స్‌చక్ర క్యాన్సర్ సెంటర్ వైద్య బఅందంలోని డాక్టర్ రాము, డాక్టర్ మహతి, డాక్టర్ శ్రీఫణి, డాక్టర్ సుమన్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ యశ్వంత్, డాక్టర్ ప్రియదర్శిని, డాక్టర్ హరీష్, డాక్టర్ రాకేష్ తదితరులు ఆసుపత్రి సిబ్బంది కార్యక్రమంలో పాల్గన్నారు. రొమ్ము క్యాన్సర్‌ను సకాలంలో గుర్తిస్తే చికిత్స శులభం అవుతుందని చెప్పారు. సిమ్స్ నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు, సిబార్ డెంటల్ కాలేజ్ విద్యార్థులు పాల్గని ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

మీకోసం వెబ్ సైట్‌లో అర్జీలు సమర్పించవచ్చు : కలెక్టర్

ప్రజాశక్తి - గుంటూరు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లోనే కాకుండా అర్జీలను మీకోసం వెబ్‌సైట్‌లోను సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీల వివరాలు Meekosam. ap.gov.in వెబ్‌సైట్‌లోనూ నమోదు చేసుకోవచ్చున్నారు. అదే విధంగా అన్ని కార్యాలయాల్లో ప్రజల సమస్యలు సోమవారం స్వీకరిస్తారని తెలిపారు. అర్జీల నమోదు, నమోదైన అర్జీల స్థితి, వాటికి సంబంధించిన సమాచారం తెలుసుకోవటానికి 1100కి నేరుగా ఫోన్‌చేసి వివరాలు తెలుసుకోవచ్చున్నారు.

ప్రజారోగ్య పరిరక్షణలో వైద్య సిబ్బంది పాత్ర కీలకం

- సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- వైద్య పరీక్షలతో వ్యాధి నిర్ధారణ సులభతరం
- పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి





సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి సూచించారు. పల్నాడు జిల్లా లోని అన్ని ప్రభుత్వ హాస్పిటల్స్, పిహెచ్ సి, యుపిహెచ్‌సి, సిహెచ్‌సిల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ ఆరోగ్య అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. తరచు ఆయా ఆరోగ్య కేంద్రాలను సందర్శించి, రిజిస్టర్ల ను పరిశీలించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలు సమీక్షిస్తున్నామన్నారు. టీబి నిర్మూలన, ఎన్.టి.ఇ.పి, మలేరియా నిర్మూలన, లెప్రసి వ్యాధి నియంత్రణ తదితర రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ నిర్దేశించిన వైద్య సేవలు లక్ష్యాలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడారు.

జిల్లాలో డెంగ్యూ, మలేరియా కేసులు ఉన్నాయా?

ఈ ఏడాది జనవరి నుండి ఇప్పటి వరకు డెంగ్యూ 30 కేసులు నమోదు కాగా బాధితులు పూర్తి ఆరోగ్యంగా ఉన్నారు. ఒక్క మలేరియా కేసు కూడా నమోదు కాలేదు. డెంగ్యూ నిర్ధారణకు సంబంధించి ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు తనిఖీ చేయాలని మలేరియా సబ్ యూనిట్ అధికారులను ఆదేశించారు. డెంగ్యూ పాజిటివ్ వస్తే సదరు ఆసుపత్రి, ల్యాబ్‌లలో ఏ విధంగా పరీక్షలు చేస్తున్నారనే వివరాలు ఆరోగ్య శాఖ ప్రతిపాదించిన ఫార్మేట్ నందు నమోదు చేసేలా చూస్తున్నామన్నారు. ఎలీసా రీడర్ ద్వారా డెంగ్యూ నిర్ధారణ జరిగితే కేసు నమోదైన ప్రాంతంలో దోమల నివారణకు చర్యలు, ఫ్రైడే డ్రైడే పాటించేలా చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాం. గత ఏడాదితో పోలిస్తే 70 శాతం వరకు డెంగ్యూ కేసులు అదుపులో ఉన్నాయి. గత ఏడాది జనవరి నుండి సెప్టెంబర్ నెల వరకు డెంగ్యూ 200 కేసులు నమోదు కాగా మలేరియా 27 కేసులు నమోదయ్యాయి.

పల్నాడు జిల్లాలో ఎన్ని పిహెచ్‌సిలు ఉన్నాయి? పిహెచ్.సిలలో సిబ్బంది కొరత ఉందా?

పల్నాడు జిల్లాలో 39 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 26 యుపిహెచ్‌సి లు ఉన్నాయి. పిహెచ్‌సిలలో సిబ్బంది కొరత లేదు. యుపిహెచ్ సి లలో మెడికల్ ఆఫీసర్ల కొరత ఉంది. దీనిపై జిల్లా కలెక్టర్‌కు, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులకు నివేదించాం.

పిహెచ్.సి వైద్యుల సమ్మె నేపథ్యంలో తీసుకున్న ప్రత్యేక చర్యలు?

జిల్లాలో పిహెచ్‌సిలలో వైద్యులు ఓపి సేవలు మాత్రమే నిలిపివేశారు. అత్యవసర వైద్య సేవలు, ఓపి సేవలకు సిబ్బంది ఉన్నారు. ప్రత్యామ్నాయంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుండి కొంత మంది సిబ్బందిని నియమించి సేవలకు ఎటువంటి అంతరాయం ఏర్పడకుండా వైద్య సేవలు అందిస్తున్నాం.

'స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం వివరాలు?

మహిళలు ఎటువంటి వ్యాధి లక్షణాలకు గురైనా తక్షణమే వైద్య పరీక్షలు చేయించుకుని మెరుగైన చికిత్స పొందేలా అవగాహన కల్పించడమే స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్' వైద్య శిబిరాల నిర్వహణ ఉద్దేశ్యం. స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్' వైద్య శిబిరాలు ఈ నెల 2తో ముగిసాయి.కౌమార బాలికలు ప్రతి నెల హిమోగ్లోబిన్ నిర్ధారణ కోసం రక్త పరీక్షలు చేయించుకోవాలని రక్తహీనత నివారణకు పండ్లు, ఆకుకూరలు ఆహారంగా తీసుకోవాలి.

రేబిస్ వ్యాక్సిన్, పాము కాటుకు టీకాలు అందుబాటులో ఉన్నాయా?

అన్ని పిహెచ్ సిలలో కుక్క, పాము కాటుకు టీకాలు అందుబాటులో ఉన్నాయి. సరైన చికిత్స అందిస్తే కుక్కల ద్వారా మనుషులకు వ్యాపించే రేబిస్ వ్యాధిని 100 శాతం నివారించవచ్చు. రేబిస్ నివారిద్దాం అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. రేబిస్ నివారణకు కుక్కలు, పిల్లులు, పెంపుడు జంతువులకు తప్పని సరిగా వ్యాక్సిన్ వేయించాలి.

గర్భిణులకు, చిన్నారులకు సకాలంలో టీకాల వివరాలు?

గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయాలలో వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలి. వీటి వల్ల ప్రాణాంతకర వ్యాధుల బారిన పడకుండా చిన్నారులను కాపాడుకోవచ్చు. గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఈ టీకాలపై వైద్య సిబ్బంది ద్వారా నిరంతరం అవగాహన కల్పిస్తున్నాం. టీకా సమయాన్ని ప్రతి ఇంటికి ఆశా వర్కర్ల ద్వారా సమాచారం అందజేసి గ్రామ సచివాలయాలలో అంగన్‌వాడీ సెంటర్లలో టీకా వేసే సమయాన్ని 2 రోజుల ముందే గర్భిణులకు, బాలింతలకు ఇంటి వద్దకే వెళ్లి గర్భిణులు, చిన్నారులకు నిర్దేశించిన సమయాల్లో వ్యాధి నిరోధక టీకాలు వేయించడం ద్వారా ప్రాణాంతకర వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చు. గ్రామీణ ప్రాంత ప్రజలకు టీకాల వల్ల కలిగే సత్ఫలితాలను వివరిస్తూ వైద్య సిబ్బంది ద్వారా నిరంతరం అవగాహన కల్పిస్తున్నాం.

ప్రజలకు ఆరోగ్య పరమైన సూచనలు..?

డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్, డయేరియా వంటి వ్యాధుల నివారణకు శుభ్రత పాటిస్తూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమల వ్యాప్తిని అరికట్టాలని వివరించారు. అనారోగ్య లక్షణాలు కనిపిస్తే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఉచిత వైద్య సేవలు, మందులు తీసుకుని, అవసరమైన పరీక్షలను చేయించుకోవాలి. ఆరోగ్య సిబ్బంది సీజనల్ వ్యాధు లపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి, కేసులు వెలుగులోకి వచ్చిన వెంటనే తక్షణమే స్పందిస్తూ ప్రజారోగ్య పరిరక్షణలో సిబ్బంది పాత్ర ఎంతో ముఖ్య మని, సమయానికి చర్యలు తీసుకోవడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చు. ప్రతి ఒక్కరూ సాంప్రదాయ ఆహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలి.

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ప్రమాద భరితంగా క్వారీలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని నడింపాలెం గ్రామంలో క్వారీలు ప్రమాద భరితంగా మారుతున్నాయి. దీనికి తోడు అదే ప్రాంతంలో ప్రకృతి వైద్య పరిశోధన కేంద్రం ఏర్పాటుకు ఆయుష్ ఆరోగ్య మందిర్‌కు ప్రతిపాదలు సిద్ధం చేశారు. ఆ ప్రాంతం నివాస యోగ్యం కావడంతో మట్టి తవ్వకాల వల్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడితే నీరు నిలుస్తోంది. అటువైపు వెళితే ప్రాణాలు పోతాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ మట్టి తవ్వకాల జరిగే ప్రాంతంలో కనీసం ప్రమాద హెచ్చరికల బోర్డులు, చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అప్పటి అధికారులు జేసీ భార్గవ్ తేజ్, తహాశీల్దార్ కరుణ కుమార్ ఈ భూమిని పరిశీలించారు. ఆగస్టు నెలలో హాస్పిటల్ ఏర్పాటుకు స్థలాన్ని సమకూర్చేందుకు రాష్ట్ర మంత్రి వర్గం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన భేటీ అయ్యి అమోదం కూడా తెలిపింది. దీని కోసం కేంద్ర ప్రభుత్వం 5.18 కోట్లు నిధులను ఖర్చు చేసి 100 పడకల హాస్పటల్ నిర్మించనుంది. దీంతో నడింపాలెం పరిసర ప్రాంతాలు అంతటా అభివృద్ధి చెందుతాయి అని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌లోని నేచర్ కేర్ క్యూర్ హాస్పటల్ ఏర్పాటు జరిగి ఆ ప్రాంతమంతా అభివృద్ధి చెందిందో అలానే నడింపాలెం అభివృద్ధి చెందు తుంది అని అధికారులు అంచనా వేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.





మట్టితవ్వుతున్న పొక్లెయినర్, హాస్పిటల్ ఏర్పాటుకు ఇచ్చిన స్థలం

దుండగులను అరెస్ట్ చేయాలి



నిరసనలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

ప్రజాశక్తి - గుంటూరు

చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం, దేవళంపేటలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి నిప్పు అంటించిన దుండగులను వెంటనే అరెస్టుచేసి, కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వం, పోలీస్‌శాఖ చర్యలు తీసుకోవాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా కార్యదర్శి జొన్నకూటి నవీన్ ప్రకాష్ కోరారు. ఆదివారం వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమంలో నవీన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ విగ్రహం దగ్గమైనచోట మరో విగ్రహాన్ని ప్రతిష్టించింది కానీ, ఘటన జరిగి మూడ్రోజులు అయినా ఇంతవరకు దోషులను అరెస్టు చేయలేదని అన్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులపై దాడులు పెరిగాయన్నారు. ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నియోజకవర్గం పిఠాపురంలో దళితులపై దాడులు చేస్తే నిందితులపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదని విమర్శించారు. నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కెవిపిఎస్ నగర అధ్యక్షులు జి.లూథర్‌పాల్ మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత భారత రాజ్యాంగం మీద నిరంతరం దాడి జరుగుతుందన్నారు. ఈ చర్యలను ప్రజాస్వామిక వాదులు అందరూ వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి బి.ముత్యాలరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ సమీర్, కెవిపిఎస్ నాయకులు ఎం. సుందరబాబు, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి జాన్ బాబు, నాయకులు జి. వెంకట్రావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు